57363

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం



సెప్టెంబర్ 14, 2008



బిగ్ బ్యాంగ్

హ్యాపీ బర్త్‌డే

(2008 సెప్టెంబర్ 14 నుంచి- 2008 సెప్టెంబర్ 20 వరకు)

పి. గౌరవ్, పి.గమన్
8సం-2సం॥సెప్టెంబర్ 16
గాయత్రి-గెల్వయ్య
తిలక్‌నగర్-హైదరాబాద్

బి. ప్రకాశ్
2సం॥, సెప్టెంబర్-16
సరోజ-కిషన్
మునిగలవాడల-వరంగల్

కె. ఉష
4సం॥, సెప్టెంబర్-17
రజిత-తిరుపతి
భవానినగర్-సికింద్రాబాద్

ఎస్. భార్గవి
2సం॥, సెప్టెంబర్-19
శారద-బాలస్వామి
అమరచింత-మ॥నగర్

మంజిత్‌బాల
7సం॥, సెప్టెంబర్-15
సరస్వతి-శ్రీహరి
కొల్లాపూర్-మ॥నగర్

విక్రమ్‌స్వరూప్
1సం॥, సెప్టెంబర్-18
శ్రీలక్ష్మి-శ్రీనివాసరెడ్డి
లింగంగుంట-నర్సరావుపేట

సుగుణతెరిస్సా
సెప్టెంబర్-16
లీలామనోహరి-హెరాల్డ్‌బాబు
ఏలూరు-ప॥గో

ఎం. ప్రీతంబాబు
9సం॥, సెప్టెంబర్-1999
అనిత-రమేష్‌బాబు
నిజామాబాద్

ఎల్. సాయిరోహన్‌రెడ్డి
సెప్టెంబర్
మాధవి-శ్రీకాంత్‌రెడ్డి
నాగోల్

ఝాన్సీలక్ష్మీబాయి
3సం॥, సెప్టెంబర్-15
రామలక్ష్మి-శ్రీనివాస్
సామర్లకోట

ఎస్. విశాల్ తేజ(పండు)-వర్షిత(పింకి)
సెప్టెంబర్-19
పద్మజ-గిరిప్రసాద్
భద్రాచలం-ఖమ్మం

చంద్రలేఖ
9సం॥, సెప్టెంబర్-1999
తులసి-శరత్‌బాబు
భద్రాచలం-ఖమ్మం

కె. మేఘన
2సం॥, సెప్టెంబర్-20
గీతాదేవి-కృష్ణంరాజు
బెంగుళూరు-కర్నాటక

ఎస్. ప్రేమ్‌నాయుడు
4సం॥, సెప్టెంబర్-17
జ్యోతి-రవికిరణ్
కృష్ణలంక-విజయవాడ

జి. శరత్‌కుమార్
4సం॥, సెప్టెంబర్-16
పల్లవి-పవన్‌కుమార్
బిజ్వార్-మ॥నగర్

ఎన్. నిరంజన్(నాని
2సం॥, సెప్టెంబర్-2006
తిరుపతమ్మ-శ్రీనివాసులు
ఆత్మకూరు-నెల్లూరు

పి. చైత్రిని
3సం॥, సెప్టెంబర్-20
అనిత-యాదయ్య
గుండాల-నల్లగొండ

ఎం. సాయికృష్ణ జాహ్నవి
7సం॥, సెప్టెంబర్-16
శ్రీదేవి-శివప్రసాద్
విజయనగరం

వైద్యుడికి ఓర్పు వుండాలి

మన అతిథి

పేరు	:	డాక్టర్ చిత్తూరు ఉమేష్ చంద్ర
స్వస్థలం	:	చిత్తూరు
పుట్టిన తేది	:	27.7.1947
తల్లిదండ్రులు	:	డా॥ హేమచంద్ర, ఉమాబాల
విద్య	:	ఎంబిబిఎస్, ఎండి (ఉస్మానియా), డిఎం (మద్రాస్ యూనివర్శిటీ)
వృత్తి	:	హృద్రోగ వైద్య నిపుణులు
నచ్చిన వ్యక్తులు	:	తల్లిదండ్రులు, అబ్దుల్ కలామ్
బలం	:	కష్టపడే గుణం
బలహీనత	:	సున్నితత్వం
అభిరుచులు	:	రోగుల సేవ, ఫొటోగ్రఫీ, సంగీతం వినడం
మరచిపోలేనిది	:	అందరికీ వైద్యం చేసేవాణ్ణి గుండెపోటుతో బాధపడిన తల్లిని కాపాడుకోలేకపోవడం.
పర్యటించిన ప్రదేశాలు	:	అమెరికా, యూరప్, ఈజిప్ట్, మలేషియా, సింగపూర్, చైనా, హాంగ్‌కాంగ్.

మన సమాజంలో 90 శాతం మంచివారే. మంచివాళ్లను ప్రోత్సహించాలి. స్వార్థం ఉండకూడదు. ఉన్నదాంతో తృప్తిగా వుండాలి. మనకున్నదాంట్లోనే ఇతరులకు సహాయం, సేవ చేయాలి. ఇవి డబ్బు రూపేణా కానవసరం లేదు. మాట సహాయమూ చేయొచ్చు. పట్టుతప్పుతున్న నేటి యువతను సరైన నిర్దేశంలో నడిపించాలి. టీవీలు, సినిమాలు, పాశ్చాత్య సంస్కృతి యువతను పెడతోవ పట్టిస్తున్నాయి. నైతిక విలువలు పెంచే కార్యక్రమాలు పెరగాలి. తల్లిదండ్రులు, గురువులు, తోటి వారిని గౌరవించడం చిన్నప్పటి నుంచి పిల్లలకు అలవర్చాలి. కని, పెంచి, పెద్దచేసిన తల్లిదండ్రులను పిల్లలు తమ వద్ద వుంచుకోకుండా వారిని ఇబ్బందికి గురిచేయడం బాధాకరం. తాము కూడా ఒక నాటికి వృద్ధులమౌతామన్న విషయాన్ని మరచిపోకూడదు. మానవత్వం, నైతిక విలువలకు మీడియా ప్రాధాన్యమివ్వడం లేదు. సంచలన వార్తలమీద దృష్టి పెడుతోంది. మంచి వైద్యునికి ఓర్పు, కష్టపడే తత్వం వుండాలి. చికాకు ఉండకూడదు. ప్రతి రోగిని తన సొంత కుటుంబ సభ్యునిగా చూసుకోవాలి.

C.H. Umesh Chandra

ఈ సంచికలో....

టపా	...	2
సీరియల్	...	8
సినిమా	...	10
రుచి	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14

ఇంకా...

మంచిపుస్తకం ...6

75 ఏళ్ల తెలుగు సినీ సంచారం

తెలుసుకుందామా... 4

ఇదీ వింబుల్డన్ స్టేడియం విశిష్టత

ఆరోగ్యం	...	17
లాహిరి...	...	20
చూద్దామా	...	22
కొత్త పుస్తకాలు	...	24

కథ 18

మార్నింగ్ వాక్

ఆలోచింపచేసిన 'కథాగానం'

డా॥ పాపినేని శివ శంకర్ సాహిత్య, తాత్విక వ్యాసాల సంపుటి 'నిశాంత' పుస్తక పరిచయం విజ్ఞానదాయకంగా వుంది. సాహిత్య ఉద్యమాలకు దిక్సూచిగా వుంది. విలువైన సాహితీ విమర్శలు రచయితలు, ఉద్యమకారుల మెదళ్లకు పదును పెడతాయి. సిద్ధాంత తాత్వి కపరమైన రచనలు ఇందులో వున్నందున ఉద్యమకారులు తప్పని సరిగా చదవవలసిన పుస్తకం. కథాగానం కథ ఆలోచింపచేసింది. ఆరోగ్యం గురించి వస్తున్న వ్యాసాలు విజ్ఞానదాయకం.

టి. శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖపట్నం.

అట్టమీది కథ రమణీయం

ఆగస్టు మాసం ఆఖరి ఆదివారం సంచిక 'స్నేహ' అనుబంధం గణేశుని ముఖచిత్రంతో రమణీయంగా ఉంది. 'అట్టమీది కథ'గా అందించిన గజముఖుని విశేషాలు, ఎంతో అపూర్వంగా ఉన్నాయి. ముఖ్యంగా విదేశీ వినాయక విశేషాల్ని తొలిసారిగా తెలుసుకున్నాం. జంతువుల ఆకారాలలో కొప్పులను, సింగారించుకున్న అతివలు కొత్త అందాలతో మెరిసిపోతున్నార నిపించింది. "విజ్ఞానవీచిక" శీర్షిక ద్వారా విజయ్ అందించిన విశే షాలను బట్టి 'ఒలిపింక్స్ జ్యోతి'ని లెనోవ్ సంస్థ తయారు చేసిందని మాకర్థమైంది. "సినిమా కబుర్లు" శీర్షిక ద్వారా షియాజీ షిండేని కలుసుకోగలగడం సంతో షమనిపించింది. ఇతర భాషలలోనూ తన పాత్రకు తానే, డబ్బింగ్ చెప్పుకోగలిగే, అతి తక్కువ మంది కళాకారులలో, ఈయనను ముఖ్యమైన వ్యక్తిగా చెప్పవచ్చు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజిస్టులందరూ, విశేష పరిజ్ఞానాన్ని, ఉపయోగించి, సామాజిక రుగ్మతలను రూపుమాపటానికి కృషి చేయాలని పేర్కొన్న మన అతిథి అల్లం అప్పారావు గారికి మా ధన్యవాదాలు.

- నేమాన సుభాష్ చంద్రబోస్, ఇలిసిపురం జక్షన్, శ్రీకాకుళం

విదేశాల్లోనూ... వినాయకుడి విశేషాలు

చదువుల వేల్పుగా పూజలందుకునే వినాయకుడి నిమజ్జనం ప్రాధాన్యతను గురించీ, వినాయకుడిని గురించి వివిధ కథలను ఆదివారం ప్రజాశక్తి అనుబంధంలో అట్టమీది కథ ద్వారా తెలుసుకున్నాం. నీటిలో కరగని ఓ విధమైన మెటీరియల్‌ను ఉప యోగించి వినాయక విగ్రహా లను తయారు చేయడం వల్ల నిమజ్జనం చేయడంలో 'సాగర్' నీరు కలుషిత మవుతుండడం బాధా కరమైన విషయం! అధికారులు వినాయక విగ్రహాల తయారీ దారులపై సరైన నియంత్రణను చూపితే మార్పు రాగలదు. ప్రజలు కూడా వాస్తవ పరిస్థితులను తప్పక గమనించాలి. విదేశాలలో కూడా వినాయకుడి గురించి చదివి ఆశ్చర్యపోయాం. అలాగే దర్దీ గీతాల ప్రాముఖ్యతను గురించి లాహిరి శీర్షికలో తెలుసుకున్నాం. సైక్లింగ్‌లో బైకల చక్రాలు, విల్లులు, వాలీబాల్ మొదలైన ఆట వస్తువుల తయారీలో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి విశేషాలను 'విజ్ఞాన వీచిక' శీర్షికలో తెలుసు కున్నాం. మూత్రాశయంలో వచ్చే ఇన్ఫెక్షన్ గురించి 'ఆరోగ్యం' శీర్షిక ద్వారా వివరంగా తెలుసుకున్నాం... "ఉండ్రాళ్లు" తయారీ గురించి 'రుచి' శీర్షికలో తెలుసుకున్నాం.

గొల్లమందల సురేష్ కుమార్, సీతారాంపురం, ఖమ్మం.

విజ్ఞానదాయకం

స్నేహలో మన అతిథి శీర్షికన టెక్నాలజీ సాయంతో సామాజిక రుగ్మతులను పోగొట్టాలి. అంటూ అప్పారావు గారిచ్చిన సందేశం బాగుంది. ఆయన ఇష్టాలు, ఆకాంక్షలు సేవాదృక్పథంతో ఉన్నాయి.

విజ్ఞాన వీచికలో క్రీడల్లో టెక్నాలజీ అంటూ ఒలిపింక్స్ జ్యోతిని కంప్యూటర్లు తయారు చేసే ప్రసిద్ధ కంపెనీ లెనోవ్ తయారు చేసింది. డార్ట్ విష్ అనే సాఫ్ట్‌వేర్ పాకేజ్ అమెరికన్ క్రీడాకారులకు ఒక గొప్ప వరమంటూ క్రీడలలో ఉన్న ముఖ్యమైన విషయాలను తెలియ జేసినందుకు ధన్యవాదాలు. ఓ మంచి పుస్తకంలో సాహిత్య తాత్విక వ్యాసాల పుస్తక సమీక్ష బాగుంది. తెలుగులో సామాజిక దృష్టి గల కవులు, రచయితల సంఖ్య ఎక్కువగా వున్న సాహిత్య సృజనను విశ్లేషణాత్మకంగా పరిశీలిస్తే అనేక విధాలుగా అసంతృప్తి కలగటం బాధకరం. రచయిత మెదడుకు మేత అంటూ డా॥ పాపినేని శివశంకర్ గారి రచనలో వస్తురూపాలు, సంస్కృతి, కళ, సౌందర్యం, మార్మికం, మొదలైన సాహిత్య ధోరణులను ఇందులో చూడగలిగాము. 'ఆరోగ్యం' శీర్షికలో మూత్ర విసర్జన సమయంలో మంట, చికిత్స, నిర్లక్ష్యం చేస్తే కలిగే నష్టాలను గురించి చక్కగా తెలియజేశారు. ఆరోగ్యంలో తెలియపరుస్తున్న ప్రతి ఒక్క శీర్షిక ఉపయోగపడేవిధంగా వుంటోందని చెప్పటంలో సందేహం లేదు. న్యాయ సలహాలలో పాఠకులడిగిన సమస్యలకు ఎప్పటికప్పుడు చక్కని పరిష్కారాలు తెలియజేస్తున్నందుకు జి.ఎల్. నరసింహారావు గారికి నా ప్రత్యేకమైన నమస్కారాలు.

కర్రా వరప్రసాద్, యలమర్రు, కృష్ణాజిల్లా.

విశేషమైన వంటకం

వినాయకుడి తీరు ముఖచిత్రం బాగుంది. సామాజిక రుగ్మతలను టెక్నాలజీ ద్వారా రూపుమాపాలంటున్న అప్పారావు అభినందనీయులు. ఉండ్రాళ్లు ఈ వారం విశేష వంటకం. అట్టమీది కథ బాగుంది.

వాస్తురామచంద్ర, రాంజీనగర్, నెల్లూరు.

చవితి విశేషాలన్నీ చదివాం

ఆగస్టు 31న ఆదివారం అనుబంధంలో అట్టమీది కథ 'శీర్షిక'లో గాథానిలయుడు గజ ముఖుడు బాగుంది. వినాయక చవితి రోజున విఘ్నేశ్వరుని పూజించని వారుండరు. చిన్నా పెద్దా అందరూ అత్యంత ఉత్సా హంతో జరుపుకునే పండుగగా చెప్పవచ్చు. ఏ శుభకార్యం తల పెట్టినా ఏ దేవుని పూజించాలన్నా, ప్రప్రథమంగా పసుపు గణపతిని తమలపాకుతో ఉంచి తప్పనిసరిగా పూజిస్తారు. గణనాథుడైన గణ పతిని. ప్రథమ పూజ చేయనిదే ఆపనికి అనేక విఘ్నాలు కలుగు తాయి. ఆయనను పూజించిన వారికి అనేక శుభాలను చేకూర్చే వేలుపు కనుకనే ఆయనను విఘ్నేశ్వరుడు అన్నారు. వినాయకచవితికి సంబంధించి అన్ని విషయాలు తెలియచేసినందుకు ధన్యవాదాలు.

అనుపోజు సత్యనాగరాజు, రాజీవ్‌నగర్ కాలనీ, విజయనగరం.

రూ.510/- ల ఇంగ్లీష్ కోర్సు రూ.300/- కే



లేటెస్ట్ టెక్నాలజీ సహాయంతో

మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	+	డివిజన్-2	+	డివిజన్-3	=	ఇవన్నీ
రూ.130/-	+	రూ.170/-	+	రూ.210/-	=	రూ.300/-కే

రూ.300/- కే

ఇవన్నీ!

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు తాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

పూర్తి డబ్బు వాపస్

మీ డబ్బుకి 100% గ్యారంటీ. ఈ కోర్సు మీకు 100% సంతృప్తిని ఇస్తుంది. మనస్ఫూర్తిగా మీకీ కోర్సు నచ్చలేదని అనిపిస్తే. ఈ కోర్సు పుస్తకాలని బరబరా చింపేసి, ఆ ముక్కల్ని 15 రోజుల్లోపల మాకు తిప్పి పంపండి. మీ డబ్బుని (కేవలం పోస్టు ఖర్చులు మాత్రం మినహాయించి) మీకు ఎమ్.ఓ.చేస్తాం. ఇది మీ డబ్బుకి మేమిచ్చే గ్యారంటీ! మీరీ కోర్సులో చేరినందువల్ల లాభమేతప్ప ఎటువంటి నష్టమూలేదు. గిఫ్ట్ పుస్తకాల సైజు 9 cm X 11 cm లోనూ, కోర్స్ మెటీరియల్ సైజు 18cm x 24cm లోనూ ఉంటాయి. ఈ కోర్స్ తరువాత కూడా కొన్ని కోర్స్‌లు కలవు. వాటిని మీకు నియమిత నామ మాత్రపు ఫీజుతో పంపడం జరుగుతుంది.

4 కోర్స్ గిఫ్ట్ పుస్తకాలు ఫ్రీ

(4 ఇన్ 1 పాకెట్ సైజులో)

1. వర్డ్ పవర్ (ఆంగ్ల పదాల అద్భుత శక్తి)	3. వెర్బ్స్ డిక్షనరీ (క్రియలు - వాటి రూపాలు)
2. లెటర్ రైటింగ్ ప్రాక్టీస్ (ఇంగ్లీష్‌లో ఉత్తరాలు వ్రాసే పద్ధతి)	4. సినానిమ్ & యాంటోనిమ్స్ డిక్షనరీ (ఆంగ్ల సమాన పదాలు & వ్యతిరేక పదాలు)

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్థమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది.

- కె.సురేష్, హైదరాబాద్.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు.

- వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్పే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు, ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను.

- జె.శ్రీనివాసులు, తిరుపతి.

ఈ కూపన్ పూర్తి చేసి పంపండి

STUDENTS' ENGLISH INSTITUTE

4677

Post Bag No.8569, New No. 203(F), Habibullah Road, (Near: KodambakkamRly. Stn;) T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు + గిఫ్ట్ పుస్తకాలు కేవలం రూ.300/- లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

Name: ....

Address: ....

....

....

....

.... Pincode

ఎస్.వినయకుమార్



వింబుల్డన్ స్టేడియం విశిష్టత ఇదీ

టెన్నిస్ క్రీడా ప్రపంచంలో వింబుల్డన్‌కు ఎంతటి విశిష్టమైన స్థానముందో క్రీడాభిమానులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. టెన్నిస్‌లో ఇతర అన్ని ఛాంపియన్‌షిప్‌లు ఒక ఎత్తయితే... వింబుల్డన్ ఛాంపియన్‌షిప్ ఒక ఎత్తు. ఈ నెల 19వ తేదీ నుండి మూడు రోజుల పాటు జరిగే డేవిస్ కప్ పోటీలకు సకల సౌకర్యాలతో...సర్వాంగ సుందరంగా సిద్ధమౌతోంది వింబుల్డన్ స్టేడియం. మరి అటువంటి వింబుల్డన్ స్టేడియం విశేషాలు...ప్రత్యేకతలు..ఏంటో తెలుసుకోవాలని ఎవరికి మాత్రం అనిపించదు చెప్పండి. అందుకే... మా ప్రియమైన పాఠకుల కోసం ప్రత్యేకంగా ఈ కథనం అందిస్తున్నాం. చదివి ఆస్వాదించండి మరి.

లండన్ పర్యటన సందర్భంగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఈ స్టేడియంను సందర్శించే అవకాశం నాకు కలిగింది. సెంట్రల్ లండన్ అంటే లండన్ విక్టోరియా రైల్వే స్టేషన్ నుండి అరగంట సేపు ప్రయాణిస్తే వింబుల్డన్ గ్రామం వస్తుంది. అయితే వింబుల్డన్ స్టేడియం సందర్శనకు రెండు స్టేషన్ల ముందుగానే సౌత్ ఫీల్డ్సు స్టేషన్‌లో దిగాలి. అక్కడి నుండి బస్సులో ఐదు నిమిషాల్లో స్టేడియానికి చేరుకోవచ్చు. మాచ్‌లు జరగని సందర్భంలో పర్యాటకులను స్టేడియంలోకి వెళ్లనిస్తారు. అయితే అందుకు 11 పౌండ్ల ఫీజు వసూలు చేస్తారు. మన రూపాయల్లో చెప్పాలంటే 935 రూపాయలు. ఉచితంగానో లేదా నామమాత్రపు ఫీజుతోనో సందర్శనకు అనుమతిస్తారని భావిస్తే బోర్డుపై భారీ రేటు కన్పించింది. అంతదూరం వెళ్లాక ఇక తప్పేదేముంది! స్టేడియం సందర్శనకు గంటన్నర సమయం పడుతుంది. వెంట ఒక గైడ్‌తో పాటు ఒక సెక్యూరిటీ గార్డు ఉంటాడు డేగ కళ్లతో.

వర్షం పడినా ఆట ఆగదు

వింబుల్డన్ స్టేడియంలోని ప్రధాన కోర్టును నెంబర్ 1 కోర్టుగా పిలుస్తారు. ఆ కోర్టులో వింబుల్డన్ కప్ పోటీలు మాత్రమే జరుగుతాయి. ప్రతి ఏడాది జూన్, జులై మాసాల్లో రెండు వారాల పాటు మాత్రమే వింబుల్డన్ పోటీలు జరుగుతాయి. ఆ పదిహేను రోజుల కోసం నెంబర్ 1 కోర్టును అతి జాగ్రత్తగా ఏడాది పొడుగునా భారీ సిబ్బందితో మెయింటెన్ చేస్తుంటారు. అప్పుడప్పుడూ డేవిస్ కప్ కోసం కోర్టు నెం1ను అనుమతిస్తారు. వింబుల్డన్‌లో గత 30 ఏళ్లలో నాలుగుసార్లు మాత్రమే డేవిస్ కప్ పోటీలు జరిగాయి. ఈ ఏడాది జరగబోయేది ఐదోసారి. వర్షం కురిసినా ఆటకు ఎక్కువ సేపు అంతరాయం కలగకుండా ఈ సారి ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షం కురిసినప్పుడు స్టేడియంను పైనుండి కవర్ చేస్తారు. లైట్ల వెలుతుర్లో ఆటను కొనసాగించవచ్చు. వర్షం మొదలైన కొన్ని సెకన్లలోనే లాన్‌ను కవర్ చేస్తారు. స్టేడియంను కవర్ చేయటానికి 12 నిమిషాలు పడుతుంది. ఈ లోగా లాన్‌పై అదనపు తేమ చేరుతుంది. ఆ తేమను తొలగించి లాన్‌ను ఆటకు పూర్తిగా సిద్ధం చేయటానికి 45 నిమిషాలు పడుతుంది. అంటే ఎంత వర్షం పడినా 45 నిమిషాల అంతరాయం తర్వాత ఆటను కొనసాగించవచ్చు. వింబుల్డన్‌లోని లాన్ కోర్టుల్లో గడ్డిని మట్టితో సహా తెచ్చిపెట్టరు. కోర్టుల్లోనే విత్తనాలు చల్లి గడ్డిని పెంచుతారు. పెరిగిన గడ్డిని క్రమంగా కట్‌చేస్తూ ఆరు మిల్లీ మీటర్ల వరకు పెరగనిస్తారు. ఈ పని శాస్త్రీయ పద్ధతుల్లో అనుభవజ్ఞులైన క్యురేటర్ల పర్యవేక్షణలో జరుగుతుంది.

మొత్తం విస్తీర్ణం 42 ఎకరాలు

కోర్టు నెంబర్ 1 లో 4500 మంది ప్రేక్షకులు ఎలాంటి ఆటంకం లేకుండా మ్యాచ్‌ను వీక్షించవచ్చు. క్రీడాకారుల కుటుంబ సభ్యుల కోసం, కోచ్‌ల కోసం ప్రత్యేక వరసలుంటాయి. ఒక బ్లాక్‌ను పూర్తిగా వింబుల్డన్ క్లబ్ సభ్యుల కోసం కేటాయిస్తారు. అందులోకి క్లబ్ సభ్యులు ఎప్పుడైనా రావచ్చు, వెళ్లవచ్చు. 42 ఎకరాల విస్తీర్ణంలోని వివిధ కోర్టులు, క్రీడాకారుల కోసం కల్పించిన సౌకర్యాలు, బిబిసి స్టూడియో మొదలైనవి చూసిన తర్వాత గైడ్ మమ్మల్ని కోర్టు నెం1 లోని క్లబ్ మెంబర్ల గ్యాలరీలోకి తీసుకెళ్లారు. ఆట జరుగుతున్నప్పుడు ఇతరులు ఆ గ్యాలరీలోకి వెళ్లడం అసాధ్యం. 11 పౌండ్లు చెల్లించాం కనుక ఆట జరగని సమయంలో మాకు ఆ అవకాశం లభించింది.

ఆ...టికెట్ ధర ఎంతా...
30 నుంచి 90 పౌండ్లు మాత్రమే!

వింబుల్డన్‌కు ప్రపంచ వ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ వుంది. దాదాపు 60 దేశాల ఆటగాళ్లు ఈ పోటీలో పాల్గొంటారు. అయినప్పటికీ వింబుల్డన్ మ్యాచ్‌లను చూసేందుకు ఒకరోజు టికెట్ ఖరీదు 30 నుండి 90 పౌండ్ల మధ్య మాత్రమే ఉంటుంది. మనం రూపాయల్లో చూస్తే ఇది ఎక్కువ అన్పించవచ్చు. కానీ వింబుల్డన్‌కు ఉన్న క్రేజ్‌తో పోలిస్తే ఇది ఎక్కువ కాదు. ఒక రోజు టికెట్‌తో ఆరోజు అంటే దాదాపు 8 గంటల పాటు జరిగే మ్యాచ్‌లన్నీ చూడవచ్చు. ఎవరైనా మధ్యలో వెళ్లిపోవాలనుకుంటే తమ టికెట్‌ను ఒక డబ్బాలో వేయాలి. ఆ టికెట్‌ను ఆ రోజు ఆటలకోసం మళ్లీ అమ్ము తారు. ఆ రోజు వుండే స్థితిని బట్టి ఆ టికెట్ లభిస్తుంది. అలాంటి


సెంటర్ కోర్టు

టికెట్లను కొనటానికి కూడా స్టేడియం పరిసరాల్లో, ఆట జరిగే రోజుల్లో ఎక్కువ మందే ఎదురు చూస్తుంటారు. ఇలాంటి టికెట్లపై వచ్చిన డబ్బును క్లబ్ తన ఖాతాలోకి వేసుకోదు. ఏదైనా ఛారిటీ కార్యక్రమాలపై ఖర్చు చేస్తుంది.

సభ్యత్వం పొందడం అంత వీజీ కాదు!

ఆల్ ఇంగ్లండ్ లాన్ టెన్నిస్ క్లబ్‌లో 500 వరకు సభ్యులు ఉండవచ్చు. ప్రస్తుతం 400 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. సభ్యత్వం పొందటం సులభం కాదు. ఖరీదైందని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సభ్యత్వం పొందటానికి ఒక సులభమార్గం వింబుల్డన్ ఫైనల్ మ్యాచ్‌ల్లో గెలవడమే అని మా గైడ్ చమత్కరించారు. వింబుల్డన్ ఫైనల్స్ గెలవడం ఎంత కష్టమో ఎవరికైనా తెలుసు. ఫైనల్ గెలవడం ఒక సులభ మార్గం అని చమత్కరించడమంటే అక్కడ సభ్యత్వం సంపాదించటం ఎంత కష్టమో అర్థం చేసుకోవచ్చు. క్లబ్ సభ్యులు ఏ రోజైనా స్టేడియంలోకి రావచ్చు. అక్కడి సౌకర్యాలను ఉపయోగించుకోవచ్చు. స్టేడియంలో మూడు రెస్టారెంట్లతో పాటు మెడికల్ సెంటర్, ఫార్మసీ దుకాణాలు ఇతర అత్యవసర సేవలు అందు బాటులో ఉంటాయి. నేను స్టేడియం సందర్శించినప్పుడు ఒక క్లే కోర్టులో నలుగురు సభ్యులు సరదాగా టెన్నిస్ ఆడుతున్నారు. సభ్యులకు ఉచిత ప్రవేశంతో పాటు రెండు టికెట్లు తమ కుటుంబ సభ్యులు, లేదా స్నేహితులకోసం కొనే అవకాశం ఉంటుంది.

బీబీసీ ప్రత్యక్షప్రసారం

వింబుల్డన్ ప్రత్యక్ష ప్రసారాలను బీబీసీ ప్రసారం చేస్తుంది. అందుకోసం సర్వహంగులు గల స్టూడియో స్టేడియంలో ఉంది. స్టేడియం పైభాగంలో బార్కర్ మొక్కను టీవీ కెమెరా మెన్ ఆకారంలో కట్ చేసి ఉంచారు. మ్యాచ్‌లపై ఎక్స్‌పర్ట్స్‌తో విశ్లేషణ చేసే గదిలోకి మమ్మల్ని తీసుకెళ్లారు. ప్రపంచవ్యాప్తంగా వచ్చే ఇతర మీడియా విలేకరుల కోసం ఒక ప్రెస్ కాన్ఫరెన్స్ హాలు ఉంది. వింబుల్డన్ పోటీలో ప్రతి క్రీడాకారుడు తప్పని సరిగా పత్రికా గోష్టిలో మాట్లాడాలి. ఎవరైనా నిరాకరిస్తే భారీ మొత్తంలో జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ప్రెస్ కాన్ఫరెన్స్ వ్యవధి 10 నిమిషాలు మాత్రమే. విలేకరులు ఆటకు సంబంధించి ఎలాంటి ప్రశ్నలైనా సంధించవచ్చు. వ్యక్తిగత అంశాలపై మాత్రం ప్రశ్నలు వేయరాదు. మా గైడ్ చెప్పిన దాని ప్రకారం ఈ పది నిమిషాల ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనటానికి ఆటగాళ్లు చాలా భయపడ్తుంటారట. ఇది కాకుండా విడిగా ఇంటర్వ్యూలు తీసుకోడానికి (వన్ టు వన్) వేరే గదులూ ఉంటాయి. కొంత మంది ప్లేయర్లు తమ రిటైర్మెంట్‌ను ఇక్కడి ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ప్రకటిస్తుంటారు. అలా ప్రకటించిన వారిలో మార్టినా నవ్రతిలోవా లాంటి వారున్నారు.

ప్లేయర్లకు ఎన్ని సౌకర్యాలో!

ప్లేయర్ల కోసం విస్తృత సౌకర్యాలు ఉంటాయి. ఆట తర్వాత వారిని హోటళ్లు లేదా వారి బసలకు చేర్చటానికి కార్లు సిద్ధంగా ఉంచుతారు. మ్యాచ్ ముగిసిన వెంటనే 'ప్రైజ్ మనీ కౌంటర్' దగ్గర ప్రైజ్ మనీ చెక్ అందిస్తారు. మ్యాచ్ ఏ స్థాయిదైనా ప్రైజ్ మనీ లభిస్తుంది. ఆట సందర్భంగా వేసుకునే దుస్తులకు లాండ్రీ సౌకర్యం ఉంటుంది. అయితే నాన్ సీడెడ్ ప్లేయర్లు మాత్రం తమ దుస్తులను తామే ఇస్త్రీ చేసుకోవాలి. సీడెడ్ ప్లేయర్ల దుస్తులను లాండ్రీ వారే ఇస్త్రీ చేసి ఇస్తారు. వింబుల్డన్ టోర్నీ ప్రారంభానికి ఒక వారం ముందే ప్లేయర్లు అక్కడికి చేరుకొని మ్యాచ్ ప్రాక్టీసు చేసుకోవచ్చు. ఆ సందర్భంగా లండన్ నగరంలోని హోటల్లలో ఉండటానికి ఇష్టపడని ప్లేయర్ల కోసం స్టేడియం పరిసరాల్లో ఇళ్లు అందుబాటులో ఉంటాయి. కొంతమంది ఇళ్ల యజమానులు నెలరోజుల పాటు తమ ఇళ్లను ఖాళీ చేసి ప్లేయర్లకు భారీ కిరాయిలపై ఇచ్చేస్తుంటారు. ఆట చూడటానికి వివిధ దేశాలనుండి వచ్చే వారికోసం కూడా చుట్టుపక్కల బస లభిస్తుంది.

స్టేడియంలో సానియా మీర్జా పేరు

ఇక మ్యూజియంలో పెద్ద గ్రంథాల యంతో పాటు టెన్నిస్ పుట్టిన నాటి నుండి, దాని పరిణామాలను తెలియజేసే చిత్రాలు, ఇతర వస్తువులు ఉన్నాయి. కొందరు విజేతలు వాడిన దుస్తులు ఉన్నాయి. అందులో ఒక్క భారతీయ ఆటగాడి పేరుగానీ, ఫోటో గానీ అక్కడ కన్పించదు. కోర్టు నెంబర్1 ముందు గత వింబుల్డన్‌లో పాల్గొని ఏదో ఒక స్థాయిలో గెలిచిన వారి పేర్లను ఒక బోర్డుపై ప్రదర్శించారు. అందులో 22వ స్థానంలో మిస్ ఎస్.మీర్జా (సానియా మీర్జా) పేరు కన్పించింది. మ్యూజియంలో ఎనిమిది నిమిషాల సినిమాను కూడా ప్రదర్శిస్తారు. అందులో గడ్డి కోర్టుల ప్రత్యేకత, ప్లేయర్ల బూట్లు, బ్యాట్ల ప్రత్యేకత, ప్లేయర్లు ఒక షాట్ కోసం ఎంతశక్తిని వినియోగించాల్సి వస్తుంది? వంటి అంశాలను వివరిస్తారు. విడిగ కూడా ఎవరైనా మ్యూజియంను సందర్శించవచ్చు. ప్రవేశ రుసుము 8 పౌండ్లు.

లాన్ టెన్నిస్ (గడ్డి కోర్టులు) వింబుల్డన్ ప్రత్యేకత. గడ్డి పెంపకం, దాని నిర్వహణకు సూక్ష్మమైన జాగ్రత్తలు సైతం తీసుకుంటారు. ఎంత జాగ్రత్త అంటే వర్షం కురిసినప్పుడు కప్పే కవర్‌కి కూడా గడ్డి తగలకుండా చూస్తారు. వచ్చే ఏడాది జరగనున్న (2009) వింబుల్డన్ టోర్నీ కోసం స్టేడియంను మరింత అభివృద్ధి చేస్తున్నారు. ❊


అమెరికన్ క్లే కోర్టు

స్టేడియం ప్రత్యేకతలు

వింబుల్డన్ స్టేడియం 'ఆల్ ఇంగ్లండ్ లాన్ టెన్నిస్ క్లబ్' అనే ఒక ప్రైవేట్ క్లబ్ ఆధ్వర్యంలో నడుస్తుంది. ఈ క్లబ్ 1868లో ఏర్పడింది. 1877లో స్టేడియం ఏర్పడినప్పటికీ, అప్పటి నుండి క్రమంగా స్టేడియంను అభివృద్ధి చేస్తూ వచ్చారు. ప్రస్తుతం 42 ఎకరాల స్థలంలో 19 లాన్ కోర్టులున్నాయి. లాన్ కోర్టులంటే గడ్డితో తయారు చేసిన కోర్టులన్నమాట - అదే వింబుల్డన్ ప్రత్యేకత. అమెరికా, ఫ్రాన్స్ తదితర దేశాల్లోని టెన్నిస్ కోర్టులు క్లే కోర్టులుగా మారినప్పటికీ వింబుల్డన్ తన గడ్డి కోర్టు ప్రత్యేకతను కాపాడుకుంటోంది. 19 లాన్ కోర్టులతో పాటు, 5 రెడ్ షెల్ కోర్టులు, 3 కాంటినెంటల్ క్లే కోర్టులు, ఒక అమెరికన్ క్లే కోర్టు, 5 ఇండోర్ కోర్టులున్నాయి. ఇవి కాకుండా 20 ప్రాక్టీస్ కోర్టులు కూడా ఉన్నాయి. ప్రత్యక్షంగా మ్యాచ్‌లను వీక్షించటానికి అవకాశం లేని వారు టికెట్ కొని బిగ్ స్క్రీన్‌పై ఓపెన్ ఎయిర్‌లో మ్యాచ్ చూసే అవకాశముంది. బీరు నుండి మొదలెట్టి, అన్ని రకాల పానీయాలను, ఆహారాన్ని అక్కడ సరఫరా చేస్తారు. వాటిని కొనుక్కొని ఆరగిస్తూ బిగ్ స్క్రీన్‌పై ఆట చూడవచ్చు.


బిగ్ స్క్రీన్ ఏర్పాటు


క్లే కోర్టు


వానకు తడవకుండా చేస్తున్న ఏర్పాటు

తెర

75 ఏళ్ల తెలుగు సినీ సంచారం

భారతదేశంలోనే గాక ప్రపంచంలోనే సంఖ్య రీత్యా ప్రముఖ స్థానమాక్రమించింది తెలుగు సినిమా. ఒక దశలోనైతే ప్రపంచంలోకెల్లా ఎక్కువ చిత్రాలు నిర్మించిన ఖ్యాతి తెలుగు సినిమాకు దక్కింది. ఇది గొప్ప విషయమే అయినా కేవలం సంఖ్యతోనే సార్థకత లభించదనేది తెలిసిన విషయమే. కళా విలువలు సామాజిక ప్రయోజనం కోణాల నుంచి పరిశీలిస్తే కూడా కొన్ని గొప్పవే అవుతాయి. మరీ గొప్పవి కాకున్నా ఏదో ఒక ప్రత్యేకత కలిగినవీ వున్నాయి. 75 ఏళ్ల తెలుగు సినిమా వజ్రోత్సవ సంరంభం జరిగింది గాని ఆ విధమైన విశ్లేషణాత్మక పరిశీలన చేసే ప్రయత్నం జరగలేదు. ఇంత సుదీర్ఘ కాలాన్ని ఆ విధంగా సమీక్షించడం తేలికైన పని కాదు కూడా. అలాంటి అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన పుస్తకం పిఎస్‌రావు రచించిన "75 ఏళ్ల తెలుగు టాకీ వెలుగు నీడలు".

గత నెలలోనే మరణించిన పిఎస్‌రావు తెలుగు సినీ సాహిత్య రంగాలపై సాధికార అవగాహన గల అనుభవజ్ఞుడు. సినిమాలపై అభిరుచిని ఎప్పటికప్పుడు నిలబెట్టుకుంటూ వచ్చిన కళాహృదయుడు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ విజయవాడ ఎడిషన్‌లో ఆయన రాసిన సినిమా సమీక్షలకు అగ్రదర్శకులు కూడా ఎంతో విలువనిచ్చేవారు.

1925 మే 23 వ తేదీన పుట్టిన పి.శ్రీనివాసరావు పాఠశాల విద్య కర్నూలులో గడిచింది. తర్వాత గుంటూరు హిందూ, ఎసి కాలేజీలలో కళాశాల విద్య పూర్తి చేశారు. తర్వాత హిందూ కాలేజీలోనే ఇంగ్లీషు ట్యూటర్‌గా పనిచేశారు. విఖ్యాత దర్శకుడు విశ్వనాథ్ ఇంటర్‌లో ఆయనకు శిష్యుడు. కథా రచయిత కూడా. పత్రికా రంగంలో ప్రవేశించాలని కాంక్షించిన పిఎస్‌రావు మద్రాసులో ప్రసిద్ధ పాత్రికేయుడు కోటంరాజు రామారావు దగ్గర శిక్షణ పొందారు. అయితే పత్రికా వృత్తి చేస్తూనే తండ్రి సూచన మేరకు రైల్వే శాఖలో చేరారు. 1972 నుంచి 15 ఏళ్లపాటు ఇండియన్ ఎక్స్‌ప్రెస్, సిల్వర్ స్క్రీన్‌లలో సమీక్షలు రాసేవారు. తర్వాత పలు తెలుగు పత్రికలలోనూ రాసేవారు. ప్రజాశక్తిలో ఆయన కళా రంగ శీర్షిక నిర్వహించడమే కాక 'ఆఫ్రికా అగ్నికణం', 'చక్కెర' నవలలు అనువాదం చేశారు. 'వందేళ్ల వెండితెర' అన్న ఆయన రచనను ప్రజాశక్తి బుక్‌హౌస్ లోగడ(1996) ప్రచురించింది. తెలుగు హిందీ సినిమాలను కలగలిపి ఆ పుస్తకంలో పరామర్శించిన పిఎస్‌రావు 2008 జనవరిలో తెలుగు సినిమా 75ఏళ్ల ప్రస్తానంపై ఈ పుస్తకం వెలువరించారు.

సీనియర్ సంపాదకులు సి.రాఘవాచారి ఈ పుస్తకానికి రాసిన ముందు మాటలో ఇలా పేర్కొన్నారు: "తెలుగు సినిమా ప్రస్థానంలో మూడు దశల్ని పౌరాణిక చారిత్రిక సామాజిక ఇతివృత్తాలతో కూడిన క్రమాన్ని వర్గీకరించి బేరీజు వేసిన పద్ధతి అందులో ప్రతి దశలోనూ పతాక స్థాయి ప్రశస్తి పొందిన చిత్రాల్ని పరామర్శించిన తీరు ప్రశంసనీయం. రావు గారి ఈ రచనలో అలనాటి దర్శకులు, నిర్మాతలు, నటులే గాక ఇప్పటి వరకూ తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్న వారందరినీ ఆధారాలతో అంచనా వేసిన విధానం చలన చిత్ర విమర్శకే ప్రమాణం. మూస చిత్రాల పట్టు నుండి విడివడి కొత్త వరవడి పట్టిన వైతాళికులందరికీ ఈ రచనలో సముచిత స్థానం కల్పించారు."

భారతీయ చలన చిత్ర కళ మూలాలను పేర్కొన్న అనంతరం రచయిత తెలుగు సినిమాలకు మూల పురుషుడైన రఘుపతి వెంకయ్య గురించి చెప్పారు. దాదా సాహెబ్ ఫాల్కే స్ఫూర్తితో తను కూడా సినిమాలు నిర్మించాలనుకున్న రఘుపతి వెంకయ్య అందుకోసం తన కుమారుడైన ఆర్ఎస్ ప్రకాశ్‌కు విదేశాల్లో శిక్షణ నిప్పించి 1921లో 'భీష్మ ప్రతిజ్ఞ' మూకీ చిత్రంగా తీశారు. పదేళ్ల తర్వాత హిందీలో 'ఆలం ఆరా' మొదటి టాకీగా నిర్మాణమైనప్పుడే తెలుగులోనూ 'భక్త ప్రహ్లాద' విడుదలైంది. మొదటి దశాబ్దంలో 76 చిత్రాలు విడుదలయ్యాయి.ఆ దశకం ద్వితీయార్థంలో సామాజిక కావ్యాలనదగిన కళాఖండాల్ని అందించిన త్రిమూర్తులు- బిఎన్‌రెడ్డి (వందేమాతరం) గూడవల్లి రామబ్రహ్మం (రైతుబిడ్డ, మాలపిల్ల), వైవిరావు (మళ్లీపెళ్లి). 1935-36లోనే గాయనీ గాయకులు తమ గొంతును ఎరువిచ్చే నేపథ్య గాన ప్రక్రియ ప్రారంభమైందంటారు రచయిత. అయితే దాన్ని ఇదమిద్దంగా నిరూపించే ఆధారాలు లేవు.

1941-50 వీనుల విందు చేసిన దశకం. 1945లో 'స్వర్గసీమ'తో 'ఒహోహో పావురమా' అంటూ భానుమతి ఈ కాలంలోనే వచ్చింది. ఈ దశకంలో దాదాపు 83 చిత్రాలు విడుదలైనాయి. అందులో 23 సాంఘికాలు. 'దేవత, స్వర్గసీమ, భాగ్యలక్ష్మి, గృహప్రవేశం, మనదేశం, షావుకారు' వంటివి వాటిలో చెప్పుకోదగినవి. ఈ కాలంలోనే తర్వాత

తెలుగు సినిమా మూలస్తంభాలైన అక్కినేని నాగేశ్వరరావు, నందమూరి తారక రామారావు రంగ ప్రవేశం చేశారు. నాగయ్యతో తీసిన త్యాగయ్య, యోగి వేమన ఈ కాలంలో గొప్ప ప్రభావం చూపాయి.

1951-60లలో తెలుగు సినిమా బాల్య, కౌమారాల్ని దాటి యవ్వన దశకు చేరింది. సామాజిక ప్రయోజనం కలిగిన చిత్రాలు వచ్చాయి. వికాసమూ వినోదమూ మేళవించిన చిత్రాలెన్నో వచ్చాయి. "పాతాళభైరవి, మల్లీశ్వరి, పెద్దమనుషులు, బంగారు పాప, మిస్సమ్మ, మాయాబజార్, పెళ్లి నాటి ప్రమాణాలు, దేవదాసు, అనార్కలి, అర్ధాంగి, తోడికోడళ్లు, జయభేరి, వెలుగు నీడలు, ఎంఎల్ఎ, రాజుపేద, విప్రనారాయణ.." తదితర చిత్రాలను ప్రస్తావించి వాటి విలక్షణతనూ సూక్ష్మంలోనే దర్శింపచేశారు. 1961-70 తెలుగు సినిమాకు స్వర్ణయుగమని ఆయన అంచనా కట్టారు. "బాటసారి, రక్తసంబంధం, బంగారు పంజరం, కలిసి వుంటే కలదు సుఖం, డాక్టర్ చక్రవర్తి, ఆత్మబంధువు, గుండమ్మకథ, నర్తన శాల, శ్రీకృష్ణపాండవీయం, లవకుశ, మనుషులు మారాలి, రాముడు-భీముడు" తదితర చిత్రాలను పరామర్శించారు. ఈ కాలంలో మహాకవి శ్రీశ్రీ ఎక్కువగా పాటలు రాయడాన్నీ సాక్షితో బాపు ఔట్‌డోర్ పద్ధతులు ప్రవేశపెట్టడాన్ని ప్రస్తావించారు.

చాలా మంది మూస పద్ధతి విమర్శకులు యాభై అరవై దశకాలలో వచ్చి చిత్రాలనే పొగిడేసి తర్వాతి పరిణామాల ప్రాధాన్యతను విస్మరిస్తుంటారు. ఆ పని చేయకపోగా 1971-80 సాంఘిక విప్లవాన్ని ప్రబోధించిన దశకం అని చెప్పడం రచయిత నిశిత పరిశీలనా దృష్టికి అద్దం పడుతుంది. ఈ కాలంలోనే తెలుగు సినిమా రంగులలోకి మారింది. 80 లో ఏడాదికి 150 చిత్రాలకు మించి నిర్మించిన రికార్డును కూడా సాధించింది. ఈ దశలో వచ్చిన వాటిలో "అల్లూరి సీతారామరాజు, కాలం మారింది, ఓ మనిషీ తిరిగిచూడు, చిల్లర దేవుళ్లు, గాంధీ పుట్టిన దేశం, పూరుమ్మడి బతుకులు, ప్రాణం ఖరీదు, తరం మారింది, చలిచీమలు, కుక్క, స్త్రీ, బలిపీఠం, నగ్నసత్యం, గోరింటాకు, తీర్పు, మా భూమి, మాంగల్యానికి మరో ముడి..." వంటివి ఇందుకు ఉదాహరణలు. ఇదే కాలంలో నవలా చిత్రాలు పెరిగాయి. ఎందరో ప్రసిద్ధ దర్శకులు ప్రవేశించారు. మహిళా ప్రధాన మైన చిత్రాలు ఘన విజయాలు సాధించాయి.రచయిత వాటన్నిటినీ రేఖా మాత్రంగా పరిచయం చేశారు. ముత్యాల ముగ్గు, సంపూర్ణరామాయణం, శంకరాభరణం వంటివాటిని మరో కోణం నుంచి విశ్లేషించారు.

1981-90 పెడధోరణులకు నాంది పలికిందని రచయిత పేర్కొంటారు. కాని ఆ క్రమం ఇంతకు ముందే మొదలైంది. అయినా ఈ కాలంలో వచ్చిన "సాగర సంగమం, మేఘ సందేశం"ను ప్లాటానిక్ లవ్ కింద సూత్రీకరించారు (కాని ఆ విశ్లేషణ చెల్లేదేనా?). విశ్వనాథ్ "సప్తపది, శ్రుతిలయలు", జంధ్యాల "ఆనందభైరవి" రసిక జనాదరణకు నోచుకున్నాయన్నారు. 'మయూరి' ఒక విజయవంతమైన ప్రయోగం. 'వసంత కోకిల' దృశ్య అభినయ ప్రాధాన్యతకు అద్దం పడితే 'ప్రేమాభిషేకం' విజయం 'దేవదాసు' పట్ల తెలుగువారి మక్కువకు నిదర్శనమన్నారు. 'ఎర్రమల్లెలు, మరో మలుపు, స్వాతి, ప్రతిఘటన, కర్తవ్యం' వంటి చిత్రాలను స్పృశించారు. ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులుపై తీసిన చిత్రం వైఫల్యం పట్ల విస్మయం వ్యక్తం చేశారు. 'దాసి, రంగుల కల' వంటి కళా ప్రధాన చిత్రాలతో పాటు ఫాంటసీ కోవలో కొత్త చరిత్ర సృష్టించిన 'జగదేక వీరుడు' అతిలోక సుందరిని గుర్తుచేశారు. బహుశా 'కరుణామయుడు' కూడా ఈ కాలంలో తప్పక చెప్పుకోవలసిన చిత్రమవుతుంది.

1991-2000 చివరి దశకం తిమిరంతో సమరం అంటూనే ఆ దశలో వచ్చిన విభిన్న చిత్రాలనూ అభినందించిన రచయిత 2006 తాజా చిత్రాల వరకూ పరిశీలించి మంచి ప్రయత్నాలను మెచ్చుకుంటూనే అవాంఛనీయ ధోరణుల పెరుగుదల పట్ల ఆవేదన వెలిబుచ్చారు. తెలుగు సినిమా రంగానికి సంబంధించిన అతిరథ మహారథులను చివరలో విడిగా పరిచయం చేశారు. 75 పేజీలైనా లేని ఈ పుస్తకం 75 ఏళ్ల తెలుగు సినిమా ప్రపంచ సంచారం చేయించగలిగిందంటే రచయిత పిఎస్‌రావుకు విషయంపై వున్న ప్రగాఢమైన అధ్యయనమే కారణం. సినిమా అన్నది ఆషామాషీ వ్యవహారం కాదని, ప్రజలను అమితంగా ప్రభావితం చేసే బలీయమైన ప్రక్రియ అని నమ్మేవారందరూ తప్పక దగ్గర వుంచుకోవలసిన చిన్ని పుస్తకం ఇది.

75 ఏళ్ళ

తెలుగు టాకీ వెలుగు నీడలు

పి.ఎస్. రావ్

వెల: 50/-,

పేజీలు:66

ప్రతులకు:

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, నవోదయ, ప్రజాశక్తి, అన్ని బ్రాంచీలు.

❊





ఏది ఏది గుమ్మడి పండు
ఏది పేరేమి?

ఈ ఫొటో ఓ ప్రముఖ నటుడిది జవాబు తెలియాలంటే 21వ పేజీ చూడండి.

సీరియల్

మూలం : బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)

తెలుగు సేత: ముక్తవరం పార్థసారథి

అమెరికన్ డేగ

జరిగినకథ

కానీ, సియోలలో సిట్టింగ్‌బుల్ పాపులారిటీ ఏమాత్రం తగ్గలేదు. ఇండియన్లూ, తెల్లవాళ్లూ అని తేడా లేకుండా రిజర్వేషన్‌కు వచ్చిన ఆగంతుకులందరూ సిట్టింగ్‌బుల్‌ను చూడటానికే ఉత్సాహం చూపించారు. 1883లో ఉత్తర పసిఫిక్ రైలు మార్గం పనులు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని రెయిల్‌రోడ్ కంపెనీ ఒక కార్యక్రమం ఏర్పాటు చేసి, ఒక ఇండియన్ చీఫ్ ముఖ్య అతిథిగా విచ్చేసి (గ్రేట్ ఫాదర్, ఇతర ప్రముఖులనూ ఉద్దేశించి) ఉపన్యసించాలని కోరింది. సిట్టింగ్‌బుల్‌కే ఆహ్వానం అందింది. సియో భాష తెలిసిన సైనికాధికారి వుపన్యాసం తయారు చెయ్యటంలో అతడికి సహకరించాడు. ఉపన్యాసం సియో (భాష) లోనే వుంటుంది. సైనికాధికారి వాటిని తర్జుమా చేస్తాడు.

(70 వ భాగం)

సెప్టెంబర్ 8 నాడు, సిట్టింగ్‌బుల్, ఇతరులు రెయిల్‌రోడ్ ప్రారంభోత్సవానికి బిస్మార్క్ చేరుకున్నారు. లాంఛనంగా పెరేడ్‌లో పాల్గొని, వక్తలకోసం ఏర్పాటు చేసిన వేదిక ఎక్కారు. ఇతర ప్రముఖులతో పరిచయాల తర్వాత, సిట్టింగ్‌బుల్ హఠాత్తుగా ఉపన్యాసం ప్రారంభించాడు. అదో అనూహ్య పరిణామం. ఇతర వస్తువులు, ప్రముఖులతో సహా, సభికులందరూ అతని వాగ్ధోరణికి విస్మయం చెందారు. మర్యాదపూర్వకంగా చెయ్యవలసిన వుపన్యాస పాఠాన్ని పూర్తిగా మార్చివేశాడు సిట్టింగ్‌బుల్.

"తెల్లవాళ్లంటేనే నాకసహ్యం. మీరంతా దొంగలు. పచ్చి అబద్ధాల కోర్లు. మా భూమిని కబ్జా చేసి మమ్మల్ని నిరాశ్రయుల్ని చేశారు" అంటూ ప్రారంభించాడు. అదృష్టవశాత్తూ అది సియో భాషలో ఉంది. దుబాసీగా ఉన్న సైనికాధికారికి తప్ప మరెవరకీ అర్థం కాదు. సభికులు మర్యాదపూర్వకంగా కరతాళ ధ్వనులు చేస్తూనే ఉన్నారు. సిట్టింగ్‌బుల్ కూడా మధ్యమధ్యన ఆగుతూ, తల వంచుతూ చిరునవ్వుతో తన తిట్ల పురాణం కొనసాగించాడు. ఆ తర్వాత దాన్ని ఇంగ్లీషులో చదవటం ఆఫీసర్ వంతు. అతడు తను రాసుకొచ్చిన వుపన్యాసానికి మరిన్ని పొగడ్తలు జోడించి సిట్టింగ్‌బుల్‌కు వాళ్లలో గౌరవం మరింత పెంచాడు. చప్పట్లతో హాలు మార్మోగింది. 'ముఖ్యవక్త' ఖ్యాతి ఇనుమడించింది. అతణ్ణి సెయింట్‌పాల్‌లో మరో కార్యక్రమానికి కూడా ఆహ్వానించారు.

మరుసటి సంవత్సరం, అమెరికన్ నగరాల్లో పర్యటించటానికి సిట్టింగ్ బుల్‌ను అనుమతించాడు సెక్రెటరీ ఆఫ్ ఇంటీరియర్. ఈ ఇండియన్ చీఫ్, అమెరికన్ల మనసుల్ని దోచుకున్నాడు. విలియం.ఎఫ్.కోడీ(బఫెలో బిల్) అతణ్ణి తన వైల్డ్ వెస్ట్ షో (ఒక వినోద ప్రదర్శన) లో భాగంగా వుండమన్నాడు. ఈ ప్రతిపాదనకు ఇండియన్ బ్యూరో మొదట అభ్యంతరం చెప్పింది కానీ, వైట్ హెయిర్ మెక్ లాలిన్ తన అంగీకారం తెలియచేశాడు. "అమెరికన్ ప్రేక్షకులకు అతణ్ణి చూడటమే వినోదం. మనమెందుకు అడ్డు చెప్పాలి?" స్టాండింగ్ రాక్‌లో మాత్రం ఇండియన్ ప్రతిఘటనకు ప్రతీకగా నిల్చాడు సిట్టింగ్‌బుల్. మెక్‌లాలిన్ దేన్ని రూపు మాపటానికి నిశ్చయించుకున్నాడో దాన్ని రక్షించటానికి తన శాయశక్తులా ప్రయత్నించాడతడు. సిట్టింగ్‌బుల్ దేశ పర్యటనలో వుంటేనే వైట్‌హెయిర్ లక్ష్యం సులభంగా నెరవేరుతుంది.

1885లో, బఫెలో బిల్స్ వైల్డ్ వెస్ట్‌లో చేరిన సిట్టింగ్ అమెరికా, కెనడాలలో కూడా విస్తృతంగా పర్యటించాడు. అతడు స్టేజి మీద కనిపిస్తే చాలు ప్రేక్షకుల హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. కొంతమంది అతణ్ణి "కిల్లర్ ఆఫ్ కస్టర్" అని కూడా అంటారు. కానీ ప్రతిసారీ ప్రదర్శన తర్వాత, అతని ఫొటోల మీద ఆటోగ్రాఫుల కోసం ఎగబడ్డారు అభిమానులు (ఆటోగ్రాఫుల కోసం డబ్బులు కూడా ఇవ్వాలి). అయితే, అలా వచ్చిన డబ్బు, ఆకలితో అలమటిస్తున్న వీధి బాలలకు అక్కడికక్కడే విరాళంగా ఇచ్చాడు సిట్టింగ్‌బుల్. "తెల్లవాళ్లకు పేదల కష్టాలు పట్టవా? వీళ్లు కూడా తెల్లవాళ్లేగా? మీకు డబ్బులు సంపాదించటం తెలిసినట్టుగా, దాని సద్వినియోగం తెలియదు" అంటూ వైల్డ్ వెస్ట్ షోలోని మరో స్టార్ ఆనీ ఓక్లీన్‌కి తన అభిప్రాయం తెలియజేశాడు సిట్టింగ్‌బుల్.

ఆ సంవత్సరం ప్రదర్శనల కాంట్రాక్టు ముగిసిన తర్వాత, బఫెలో బిల్ ఇచ్చిన రెండు బహుమతులు - ఒక సొంబ్రెరో (పెద్దహ్యాట్), విన్యాసాలు చేసే గుర్రం- తీసుకుని స్టాండింగ్ రాక్ చేరుకున్నాడు సిట్టింగ్‌బుల్. సైగలను బట్టి గుర్రం కూర్చుంటుంది లేదా ముందు కాళ్లెత్తి అభివాదం చేస్తుంది.

1887లో యూరోప్ పర్యటనకు ఆహ్వానించాడు బఫెలో బిల్. కానీ "ఇక్కడ నా అవసరం వుంది. మా భూములు కబ్జా చేస్తామంటున్నారు అధికారులు" అని నిరాకరించాడు సిట్టింగ్‌బుల్.

అయితే, కబ్జాలు ప్రారంభం కావటానికి మరో ఏడాది పట్టింది. మొదట, వాషింగ్టన్ నుండి ఒక కమిషన్ వచ్చి గ్రేట్ సియో రిజర్వేషన్ను ఆరు చిన్న రిజర్వేషన్లుగా విభజించటానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. దీని ప్రకారం తొమ్మిది మిలియన్ ఎకరాలు మాత్రమే సెటిల్‌మెంటుకు మిగులుతుంది. ఎకరాన్ని యాభై సెంట్లకు కొంటామన్నారు కమిషనర్లు. ఇది పచ్చి దగా, నిలువుదోపిడీ. ఈ మోసాన్ని సహించేదిలేదంటూ, గాల్, జాన్‌గ్రాస్‌లతో చర్యలు జరిపాడు సిట్టింగ్‌బుల్. ఉన్నదంతా వాళ్లు

లాక్కుంటే తామెక్కడుండాలి? సిట్టింగ్‌బుల్ వాళ్లను పక్కదారి పట్టిస్తున్నాడని ఇండియన్లను నమ్మించటానికి ప్రయత్నించారు కమిషనర్లు. ఇదంతా వాళ్ల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే చేస్తున్నది ప్రభుత్వం. ఉచితంగా తీసుకోవటానికి బదులు యాభై సెంట్లిస్తున్నది కదా. స్టాండింగ్ రాక్‌లో వున్న ఇరవైఆరుమంది సియోలు మాత్రమే తమ భూమిని ప్రభుత్వానికి ధారాదత్తం చేస్తూ పత్రాల మీద సంతకాలు చేశారు. క్రో క్రీక్, లోవర్ బ్రూల్ ఏజెన్సీల్లో కూడా ఆశించిన ఫలితం దక్కలేదు. నాల్గింట మూడొంతుల మంది సంతకాలు చేస్తే కానీ నిర్ణయం అమలుకాదు. కమిషనర్లు చేతులెత్తేశారు. పైన్‌రిడ్జ్, రోజ్‌బడ్‌లను (ఏజెన్సీలు) సందర్శించకుండానే వాషింగ్టన్‌కు తిరుగు మొహం పట్టారు. ఇండియన్ల అంగీకారం సాధించలేదు కనుక, 1868 నాటి ఒప్పందాన్ని రద్దుచేసి (దీని ప్రకారం అంగీకారం అవసరం) బలవంతంగా భూమిని స్వాధీనం చేసుకోవచ్చని సిఫారసు చేశారు.

1888లో ఈ ఈ సిఫారసును తిరస్కరించిన ప్రభుత్వం, మరుసటి సంవత్సరం దాన్ని అమలు చేసే దిశగా పావులు కదిపింది. ప్రత్యక్షంగా ప్రభుత్వ ప్రమేయం లేకుండా వ్యాపారస్తులు నేరుగా ఇండియన్ల నుండి భూమి కొనుక్కునే పరిస్థితి తీసుకురావాలని కొందరు సలహా ఇచ్చారు. భూమి ఎలాగూ పోతుందనే భయం ఏర్పడితే, ఇండియన్లే అమ్మటానికి ముందుకు వస్తారు.

జనరల్ జార్జ్ క్రూక్‌ను ఇండియన్లు విశ్వసిస్తారని అందరికీ తెలుసు. సియోలను ఎలాగైనా ఒప్పించాలని అతణ్ణి కోరారు. మరో కొత్త కమిషన్‌కు ఛైర్మన్‌గా వుండటానికి అంగీకరించాడు క్రూక్. ఈ కొత్త కమిషన్ ఎకరం ధర 1.50 డాలర్లకు పెంచింది.

మరో ఇద్దరు నిజాయితీ గల రాజనీతిజ్ఞులు, ఓహైమోకు చెందిన చార్ల్స్ ఫోస్టర్, మిస్సోరీకి చెందిన విలియం వార్నర్‌లతో కలిసి మే, 1889లో గ్రేట్ సియో రిజర్వేషన్‌కు బయల్దేరాడు క్రూక్. ఎలాగైనా (అవసరమైన) నాల్గింట మూడొంతుల వయోజనులైన పురుషుల సంతకాలు సేకరించటం అతని లక్ష్యం. ఇండియన్లలో విశ్వాసం పెంచటానికి సైనిక యూనిఫాం బదులు బూడిద రంగు ఫ్లానెల్ దుస్తులు ధరించాడు. ముందే తయారు చేసుకున్న ప్రణాళిక ప్రకారం, మొదటి సమావేశం రోజ్‌బడ్‌లో ఏర్పాటు చేశాడు. (అక్కడ) స్పాటెడ్ టెయిల్ హత్య తర్వాత, బ్రూల్‌లలో చీలిక వచ్చింది. అందువల్ల, వాళ్లు సమైక్యంగా తనను ప్రతిఘటించలేరని తెలుసు.

ఆరు ఏజెన్సీల చీఫ్‌లనీ ఇక్కడికే పిలిపించండి. అప్పుడు మా అభిప్రాయమేమిటో తెలుస్తుంది. మొదట మీ అంగీకారం తీసుకుని "వాళ్లు చేశారు కనుక మీరు సంతకాలు చేయండని అడుగుతారు" అంతేనా? అంటూ వ్యంగ్యంగా చురకపెట్టాడు హాలో హార్న్ బేర్.

"ఇది పంటల మార్పిడి కాలం. మీకిబ్బంది కలిగించకుండా మేమే ఏజెన్సీ నుండి ఏజెన్సీకి తిరుగుతాం, అలాగే చేయమని గ్రేట్ ఫాదర్ మమ్మల్ని ఆదేశించాడు" అని చెప్పాడు క్రూక్. హాలో హార్న్ బేర్ సహకరించనన్నాడు. హైహాక్ కూడా అన్ని ప్రతిపాదనలకూ తిరస్కరించాడు "మీరు మాకివ్వచూపుతున్న భూమి పరిమాణం చాలా తక్కువగా వుంది. మాకు సరిపోకపోయినా, మా పిల్లలకు, వాళ్లకు పుట్టబోయే పిల్లలకు, ఆతరువాతి తరాలకు ఇది సరిపోతుందా? మా చేతుల్తో మేం కూర్చున్న కొమ్మను మేమే నరుక్కోవాలా?"

"ఒకసారి ఇచ్చిన భూమిని మేం తిరిగి తీసుకోం. అందువల్లనే ఇది రాసివ్వటానికి నిరాకరిస్తున్నాం" అన్నాడు ఎల్లో హెయిర్.

"తూర్పున ఉన్న తెల్లవాళ్లు పక్షుల్లాంటి వాళ్లు. ప్రతి సంవత్సరం గుడ్లు పెడుతున్నారు. అవి పక్షులై ఎగిరినప్పుడు స్థలం లేక ఇటువైపు వస్తున్నాయి. మీరు చూస్తూనే ఉన్నారు కదా. భూమి సరిపోతే ఎవరైనా ఇంత దూరం ఎందుకు వస్తారు? మీరు వద్దన్నా సరే, వాళ్లు వస్తూనే ఉంటారు. ఈ దేశమంతా ఆక్రమించుకుంటారు. వాషింగ్టన్‌లో, మెజారిటీ ప్రకారమే నిర్ణయాలు జరుగుతాయి. పైగా, ఇక్కడ మీరు ఉపయోగంలో లేని భూమినే మేం తీసుకొంటున్నాం కదా" అంటూ వాదించాడు క్రూక్.

తొమ్మిది రోజుల చర్చల తర్వాత, బ్రూల్స్‌లోని అత్యధికులు, క్రూక్ సూచనలనంగీకరించి సంతకాలు చేశారు. అందరికన్నా మొదట సంతకం పెట్టింది స్పాటెడ్ టెయిల్ హంతకుడు క్రోడాగ్.

జూన్‌లో పైన్ రిడ్జ్ చేరుకున్నారు కమిషనర్లు. అక్కడ వుంటున్న రెడ్ క్లౌడ్ మరో కొరకరాని కొయ్య. సమావేశ మందిరాన్ని, వందలాది అనుచరులతో చుట్టుముట్టి తన బలం ప్రదర్శించాడు. రెడ్‌క్లౌడ్, అతని అనుచరులు నిరాకరించినా, సుమారు సగం మంది ఓగ్లాలాలు సంతకాలు చేశారు. లోవర్ బ్రూల్, క్రోక్రీక్, షెయెనీ రివర్ లాంటి చిన్న ఏజెన్సీలకు కూడా వెళ్లి అవసరమైన (నాల్గింట మూడొంతులు) సంతకాలు సేకరించారు. చివరిగా, జూన్ 27 నాడు స్టాండింగ్ రాక్ చేరుకున్నాడు క్రూక్. నిర్ణయం అమలు జరగటానికి ఇదే కీలకం. ఒకవేళ, హంక్ పాపాలనూ, బ్లాక్ ఫుట్ సియోలనూ ఒప్పించలేక పోతే, పరిస్థితి మళ్లీ మొదటికొస్తుంది.

తొలి సమావేశాలకు హాజరైన సిట్టింగ్‌బుల్ మౌనం పాటించాడు. అక్కడి వాళ్లంతా కమిషన్ను వ్యతిరేకిస్తున్నారనటానికి ఆ సంకేతం చాలు.

"మేం చెప్పిందంతా విన్నారు కానీ వాళ్ల నోరు మెదపలేదు. మా ప్రతిపాదనలు అంగీ కరించలేదనటానికి అదే నిదర్శనం" అన్నాడు క్రూక్.

స్టాండింగ్ రాక్‌లో ఉంటున్న సియోల ప్రధాన ప్రతినిధిగా జాన్‌గ్రాస్ తన ఉపన్యాసం ప్రారంభించాడు "ఒకప్పుడు మా వద్ద చాలా భూమి వుండేది. అందువల్ల మీరు ఆక్రమించుకున్నా మేం అడ్డుపడలేదు. కానీ ఇప్పుడు మా భూమి విస్తీర్ణం కుంచించుకు

పోయింది. అది కూడా కొనాలనుకుంటున్నారు మేం అమ్మటానికి సిద్ధంగా లేము. కానీ గ్రేట్ ఫాదర్ అమ్మమని మా మీద ఒత్తిడి తెస్తున్నాడు. ఒకప్పుడు తక్కువ ధర ఇచ్చినా మేం బాధపడలేదు. కానీ ఇప్పుడు, మీరివ్వదలచుకున్న ధరకు అమ్మటానికి మేం సిద్ధంగా లేము"

ధర సంగతెలా వున్నా, అసలు అమ్మకూడదన్నాడు సిట్టింగ్‌బుల్, ఇతరులు ఆరేళ్ల క్రితం, డాన్ కమిషన్ వైట్ థండర్ వాంగ్మూలమిచ్చినట్టుగా, "ఆ భూమి అమూల్యం".

రోజుల తరబడి చర్చలు జరిగాయి. అయినా ఫలితం కనిపించలేదు. సమావేశాలు నిష్ప్రయోజనమని తెలిసిపోయింది. జేమ్స్ మెక్‌లాలిన్ సహాయం అర్థించాడు క్రూక్. ఇండియన్లను ఒక్కొక్కరిగా సంప్రదించి, తన మాట వినకపోతే ప్రభుత్వం ఎలాగూ లాక్కుంటుందని భయపెట్టి అమ్మటానికి ఒప్పించాలి (అంటే సంతకాలు చేయించాలి). సిట్టింగ్‌బుల్ ససేమిరా అన్నాడు. యునైటెడ్ స్టేట్స్ ప్రభుత్వం 1868 నాటి ఒప్పందాన్ని రద్దు చేయటం వల్ల దాని ప్రతిష్ట దిగజారుతుందట. అటువంటి అగత్యం రాకుండా వుండాలంటే తాము సంతకాలు పెట్టాలట. ఇదెక్కడి వితండవాదం?

జాన్ గ్రాస్‌తో రహస్యమంతనాలు జరిపిన మెక్ లాలిన్ "మొత్తంమీద అతణ్ణి ఒప్పించాను. తదుపరి సమావేశంలో అతడివ్వవలసిన ఉపన్యాస పాఠం కూడా తయారు చేశాను. ఇతర చీఫ్‌లను కూడా మన దారికి తేవటానికి ఆ ఉపన్యాసంలో మంచి వాదనలు పొందుపరిచాను" అని చెప్పాడు.

సిట్టింగ్‌బుల్‌కు మాట మాత్రమైనా చెప్పకుండా ఆగస్టు 3 నాడు చివరి సమావేశం ఏర్పాటు చేశాడు మెక్‌లాలిన్. సమావేశం జరిగే మైదానం చుట్టూ నాలుగు వరుసల్లో ఇండియన్ పోలీస్‌ను పహారా పెట్టాడు. సిట్టింగ్‌బుల్ అనుచరులు అల్లరి సృష్టించకుండా తీసుకున్న చర్య ఇది. మెక్‌లాలిన్ తయారు చేసిన వుపన్యాసాన్ని జాన్ గ్రాస్ చదవటం ముగించాడో లేదో, పోలీసులను తోసుకుని ప్రవేశించిన సిట్టింగ్‌బుల్ "మాకెవరూ సమావేశం గురించి చెప్పలేదు. అయినా వచ్చాను. నేను కొన్ని విషయాలు స్పష్టం చేయాల్సి వుంది" అంటూ ప్రారంభించాడు.

ఇంకా వుంది....

నా వయసెందుకు దాయాలి?

'ఒంటరి' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన మళయాళీ నటి భావన ప్రస్తుతం 'హీరో' చిత్రంలో నితిన్ సరసన నటిస్తోంది. భావన నటనలో సౌందర్య లేని లోటును భర్తీ చేస్తుందని 'ఒంటరి' కథానాయకుడు గోపీచంద్, నిర్మాత పోకూరి బాబూరావు అభిప్రాయపడ్డారు. ఆ చిత్రం సక్సెస్ కాకపోయినా నటిగా ఆమెకు గుర్తింపు తెచ్చింది. ఇమేజ్ కంటే పెర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోవచ్చని భావిస్తున్న భావనతో ఇంటర్వ్యూ ముచ్చట్లు...

'భావన' సినిమా పేరా? అసలు పేరా?

తెర పైన 'భావన'. అసలు పేరు కార్తీక.

సినిమాల్లోకి రాకముందు భావన ఏం చేసేది?

చిన్నప్పటి నుంచీ సినిమాలంటే పిచ్చి. ఆ ఇష్టంతోనే టెన్త్ క్లాస్ తర్వాత నటినవ్వాలన్న కోరిక బలపడింది. ఓ మళయాళ చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. షాజీ కైలాస్ ఆ చిత్రాన్ని డైరెక్ట్ చేశారు. సురేష్ గోపి సహ నటుడు. అదక్కడ సూపర్ హిట్ అయింది. తమిళ ఇండస్ట్రీకి రాకముందే కొన్ని మంచి మళయాళ చిత్రాల్లో నటించాను. ఇంటర్మీడియట్‌తో చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టాను. 'ఒంటరి' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమయ్యాను. తెలుగు సినిమాల్లో నటించడానికి హైదరాబాద్ వచ్చినప్పుడు యూత్ నన్ను గుర్తుపట్టి, "ఒంటరి'లో బాగా చేశారు" అని ప్రశంసించారు.

మీ గాడ్ ఫాదర్?

దేవుడొక్కడే నా గాడ్ ఫాదర్. ఈ గ్లామర్ ఫీల్డ్‌లోకి ప్రవేశించడమే కష్టం. నిలదొక్కుకోవడం మరీ కష్టం. ఎక్కువకాలం నిలబడతామన్న నమ్మకం లేదు. ఎప్పటికప్పుడు ట్రెండ్ మారిపోతోంది. వైవిధ్యమైన స్క్రిప్ట్స్ తెరకెక్కుతున్నాయి. టాలెంట్‌తోపాటు దేవుని ఆశీస్సులూ వుండాలని నమ్ముతాను. ఈ నమ్మకం కెరీర్‌కు, నిజ జీవితానికి హెల్ప్ అవుతుందని భావిస్తాను.

అగ్ర హీరోలతో ఎప్పుడు నటించనున్నారు?

సినిమా హిట్ అయితే హీరోయిన్లకు లక్ చిక్కినట్లే. దీంతో స్టార్‌డమ్ వచ్చిందని ఫీల్ అవుతారు. పెద్ద హీరోలతో నటిస్తేనే బ్రేక్ వస్తుందన్న కామెంట్‌పై నమ్మకం లేదు. ముందుగా 'నేనొక నటి' అని నమ్ముతాను. నటుల్లో పెద్ద హీరోలు, చిన్న హీరోలు అన్న తేడా లేదు. అందరూ నటులే. నటీనటుల పెర్ఫార్మెన్స్‌నే ప్రేక్షకులు ఇష్టపడతారు.

గాసిప్స్‌కు ఎలా స్పందిస్తారు?

నామీదైతే ఎలాంటి పుకార్లూ లేవు. నటీనటులన్నాక గాసిప్స్ వస్తుంటాయి... పోతుంటాయి. పెద్దగా పట్టించుకోను. గాసిప్స్ అనేవి వాతావరణ మార్పు వల్ల వచ్చే రోగాల్లాంటివి. మా ప్రొఫెషన్‌లో ఇలాంటివి సహజమే. స్నేహానికి కూడా గాసిప్ అంటగడతారు. స్నేహానికి 'రొమాన్స్', 'పెళ్ళి' లేదా 'విడిపోయారు' అన్న మాటలు తగిలించినా... పట్టించుకోకూడదు.

సినిమా ఎంపికలో ఏయే అంశాలకు ప్రాధాన్యమిస్తారు?

ముందు కథకి. ఆ తర్వాత నిర్మాత, దర్శకుడు, హీరో.

పేరున్న దర్శకులు, హీరోల చిత్రాల్లోనే నటిస్తారన్నమాట!

ఇదే ఖచ్చితమని చెప్పను. ఈక్రమం తప్పి నటించిన సందర్భాలూ ఉన్నాయి. కొత్తగా వచ్చే ప్రతి వ్యక్తిలోనూ టాలెంట్ ఉంటుంది. దానికి గౌరవమివ్వాలి.

ఫిట్‌నెస్ కబుర్లు చెబుతారా?

రోజూ యోగా చేస్తాను. డైట్ చేయకుండా పౌష్టికాహారం తింటాను. చిరాకులతో మైండ్‌ను డిస్టర్బ్ చేయకుండా ఆనందంగా ఉంచడానికి ప్రయత్నిస్తాను. ఆరోగ్యం ఆర్టిస్టులకే కాదు, అందరికీ ముఖ్యమే.

ఇప్పటి వరకు అన్నీ దక్షిణాది చిత్రాలే చేశారు. బాలీవుడ్‌లో ఎప్పుడు నటిస్తారు?

దక్షిణాది హీరోయిన్ల చూపు బాలీవుడ్‌పై ఉండడం సహజమే. బాలీవుడ్ గురించి కలలు కంటున్నాం. అయితే అది కల అని గుర్తుంచుకోవాలి. కలను సాకారం చేసుకోవాలంటే ముందు నటిగా నిరూపించుకోవాలి. నా తొలి మళయాళ చిత్రం చూసిన ఓ హిందీ దర్శకుడు హిందీ రీమేక్‌లో నటించమని అడిగారు. అయితే సొంతంగా నిర్ణయం తీసుకునే వయసు నాకప్పుడు లేదు. అలాగే పలు తమిళ చిత్రాల కమిట్‌మెంట్స్‌తో బిజీగా ఉన్నాను. అందుకే ఆ అవకాశాన్ని జారవిడుచుకున్నాను. ఈసారి అలాంటి ఛాన్స్ వస్తే, మంచి నిర్ణయమే తీసుకుంటా.

మీ వయసు..

22.

హీరోయిన్లు తమ వయసు చెప్పుకోరు కదా! మరి మీరు మొహమాటం లేకుండా చెప్పేశారే!

నా వయసు ఎందుకు దాయాలి? ఇలా దాయడం ద్వారా నేనేమి పొందుతాను? సందర్భం వచ్చింది కనుక మీకు మూడు విషయాలు చెబుతాను. (1) అసలు వయసైనా చెప్పాలి. (2) తప్పుడు సమాచారమన్నా ఇవ్వాలి. (3) సైలెంట్‌గా అయినా ఉండాలి. వీటిల్లో ఏది బెటరంటారు? పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్‌లో నా వయసు ఉండదా చాలామంది అమ్మాయిలు తమ వయసు తగ్గించి చెప్పుకుంటారు. అలా అని అందరూ కాదు సుమా!

ప్రేమ, పెళ్ళిపై మీ అభిప్రాయం?

అందరూ మంచి జీవితాన్ని గడపాలనుకుంటారు. అందరూ ప్రేమించినాళ్ళే. అలాగే అందరి జీవితాల్లో పెళ్ళి ఒక భాగమే. నేనెప్పుడూ ప్రేమించలేదని చెప్పను. నాకు తగిన వాడిని పెళ్ళి చేసుకుంటా.

చదువు మధ్యలో ఆపేయడం బాధగా లేదా?

అవును. మొదట్లో చాలా బాధేసింది. ఆ తర్వాత దాని గురించి ఆలోచించడం మానేశాను. కెరీర్ ద్వారా చాలామందిని ఎంటర్‌టైన్ చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. పెళ్ళి తర్వాత మళ్ళీ చదువు కొనసాగించాలని వుంది.

దక్షిణాదిలో ఏ ఇండస్ట్రీ అంటే ఇష్టం?

కచ్చితంగా తెలుగే. ఇక్కడ ఎక్కువ సంఖ్యలో నటీనటులు, సాంకేతిక నిపుణులున్నారు. ఇండస్ట్రీ ప్రతి రోజూ బిజీగా ఉంటుంది. రెమ్యునరేషన్ కూడా ఎక్కువే. మరి మళయాళ అమ్మాయిలను కోలీవుడ్ (తమిళ చిత్రసీమ) మీదుగా ఇక్కడికి ఎందుకు దిగుమతి చేసుకుంటున్నారో అర్థం కావడం లేదు.

ఇప్పటి వరకు ఎన్ని చిత్రాల్లో నటించారు?

మళయాళం, తమిళం, తెలుగు భాషల్లో కలిపి 20 చిత్రాల్లో నటించాను.

❋



సొరచేప పొరుటు

కావలసిన పదార్థాలు

సొరచేప- అరకిలో, నూనె- 100 గ్రాములు, దాసినచెక్కలు- నాలుగు లవంగాలు- నాలుగు, కొత్తిమీర- ఒక కట్ట, కారం- రెండు స్పూన్లు ఉప్పు- సరిపడా, ఉల్లిపాయలు- రెండు, పచ్చిమిర్చి- ఆరు వెల్లుల్లి గర్భాలు- రెండు, ధనియాలు - రెండు స్పూన్లు

తయారు చేసే విధానం

సొర చేప బాగా కడిగి శుభ్రం చేసుకోవాలి. దీని పొట్ట దగ్గర కోసి కడుపులో ఉన్నదంతా కడిగి శుభ్రం చేయాలి. చేపల్ని ఒక గిన్నెలో వేసి స్టౌ మీద పెట్టి చేపలు మునిగేదాకా నీళ్ళుపోయాలి. కళపెళలాడుతూ పొంగు వస్తుంది. అప్పుడు దింపేయాలి. చేపకు పైన ఉన్న తోలును తీసేసి తడి లేకుండా బాగా పిండాలి. తర్వాత పొడిలాగా చేసుకోవాలి. అల్లం వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి బాగా మెత్తగా నూరి ఉంచుకోవాలి. ఉల్లిపాయలు కోసి పెట్టుకోవాలి. ధనియాలు, దాసినచెక్క లవంగాలు పొడిగా కొట్టుకోవాలి. నీళ్ళు పిండిన సొరపొరుటులో అల్లం, కారం వేసి కలపాలి. ఒక కళాయిలో నూనె పోసి బాగా కాగాక, ఈ గుజ్జును అందులో వేసి బాగా వేపాలి. ఇందులో మసాలాలన్నీ కలుపుకొని, కొత్తిమీర వేసి దింపాలి. పొడి పొడిలాడుతూ తినటానికి బాగుంటుంది.



కైమా-మెంతికూర

కావలసిన పదార్థాలు

కైమా- 500 గ్రాములు, నూనె- 150 గ్రాములు, మెంతి కూర- 15 చిన్న కట్టలు, కారం- రెండు స్పూన్లు, ధనియాలు- రెండు స్పూన్లు అల్లం- పెద్ద ముక్క ఉప్పు - రుచికి సరిపడా, కొత్తిమీర- ఒక కట్ట

తయారు చేసే విధానం

కైమాని బాగా శుభ్రంగా కడిగి నీళ్లను పిండేయాలి. మెంతికూర ఆకుల్ని చింత చిగురులా నలిపివేయాలి. అల్లం- వెల్లుల్లి, ధనియాలు, గసగసాలు ముద్దగా నూరి కైమాలో కలపాలి. ఉప్పు, కారం వేసి అరలీటరు నీళ్ళు పోసి మగ్గనివ్వాలి. ఒక కడాయిలో నూనె పోసి బాగా కాగాక దాసిన చెక్క, లవంగాలు వేయించాలి. తర్వాత మెంతికూర, కైమా మసాలా ఇగిరేదాకా వుంచి దింపుకోవాలి.

క్యాలీఫ్లవర్ పరోటా

కావలసిన పదార్థాలు

గోధుమపిండి- 2 కప్పులు, కాలీఫ్లవర్ తురుము- 2 కప్పులు, పచ్చిమిర్చి తరుగు- 1/4 కప్పు, సోంప్- 1 టీ స్పూన్, ఉప్పు - తగినంత, కొత్తిమీర తరుగు- 1/4 కప్పు, ధనియాల పొడి- 1 టీ స్పూన్ (గరమ్ మసాలా ఇష్టపడేవారు), అల్లం పేస్ట్- 1 టీ స్పూన్

తయారు చేసే విధానం

క్యాలీఫ్లవర్ తురుము, ఉప్పు, మిర్చి తరుగు, అల్లం తరుగు, ధనియాల పొడి అన్ని పదార్థాలను కలిపి వుంచాలి (క్యాలీఫ్లవర్‌ను కడిగి తుడిచి తురుముకోవాలి). గోధుమపిండిని తడిపి ఉంచాలి. పది నిమిషాల ముందే క్యాలీఫ్లవర్ మిశ్రమంలో కొంచెం గోధుమపిండిని గానీ, శనగపిండిని కాని కలిపితే తడి ఉండదు. గోధుమ పిండిని ఉండలుగా చేసి మిశ్రమాన్ని స్టఫ్ చేసి, పరోటాల మాదిరిగా కాల్చాలి. పెరుగు, వెన్న ఊరగాయతో వడ్డించాలి.



కోడిగుడ్డు నిల్వ పచ్చడి

కావలసిన పదార్థాలు

ఉడికించిన గుడ్లు- ఎనిమిది, ఆవపిండి- 30 గ్రాములు నూనె- 250 గ్రాములు, సూపు- రెండు స్పూన్లు మెంతిపిండి- 20 గ్రాములు, పచ్చికారం- 50 గ్రాములు వెల్లుల్లి- 10 గర్భాలు, ఉప్పు- తగినంత

తయారు చేసే విధానం

ముందుగా ఒక గిన్నెలో కొద్దిగా నూనె వేసి కాచుకోవాలి. దానిలో కోడిగుడ్లను ఒక్కొక్కటి బాగా వేయించి విడిగా ఉంచుకోవాలి. దానికి కొద్దిగా చిన్న చిన్న రంధ్రాలు పెట్టి వాటికి పైన చెప్పిన కారం, ఉప్పు, చల్లార్చిన నూనె కలిపి ఉంచాలి. తరువాత మెత్తగా నూరిన ఆవపిండి, మెంతి పిండి కూడా కలపాలి. చిన్నుల్లిపాయ గర్భాలను పొట్టు లేకుండా తీసి పచ్చడితో కలపాలి. వీటిని సమానంగా కలిపి చిన్న జాడీలోకి పెట్టాలి. మరుసటి రోజు కూడా కొద్దిగా కలబెట్టి మూడో రోజున రుచిగా వడ్డించుకోవచ్చు. కొంచెం పులుపు కావలసిన వారు కొద్దిగా నిమ్మకాయ రసం కూడా పిండుకోవచ్చు.

దారి కనిపెడదామా



నేస్తాలూ... ఈ బాబుకు కిందున్న బొమ్మలతో ఆడుకోవాలని చాలా ఆశగా ఉంది. అయితేనేం బోలెడన్ని గజిబిజి దారులు ఎదురుగా ఉన్నాయి. ఏ రూట్‌లో వెళ్తే ఆ బొమ్మల దగ్గరకు చేరుకుంటాడో తెలియడంలేదు. కాస్త దారి వెతికి పెడ్తారా.

రంగులేసేద్దాం

పిల్లలూ! బొమ్మ చాలా బావుంది కదూ. మరి ఇది ఇంకా అందంగా కనిపించాలంటే మంచి మంచి రంగులు నీట్‌గా వేస్తే సరిపోతుందిగా. మరి ఆలస్యం ఎందుకట. చకచకా మీ దగ్గరున్న రంగులు బయలకు తీసి పులియేయండే!

లెక్కలు చేసేద్దాం

పిల్లలూ! మీకు తీసివేతలు బాగా వచ్చు కదా. అందుకే ఇవాళ మీకు కొన్ని తీసివేతలు ఇస్తున్నాం. వీటిని త్వరత్వరగా చేసేస్తారుగా. అయితే అక్కడున్న బాక్సుల్లో ఒకటి నుండి ఏడు వరకు నెంబర్లున్నాయి. వాటిలో ప్రతి నెంబరును ఒకసారి మాత్రమే ఉపయోగించాలి.





చుక్కలు కలపండి

పిల్లలూ! ఇక్కడున్న చుక్కలన్నింటినీ వరుసగా కలిపితే ఒక పెద్ద జంతువు వస్తుంది. ఇంకా ఆలస్యమెందుకు? త్వరగా కలిపేస్తే పోలా.

జవాబు: 15-3=12, 11-3=8, 11-4=7, 7-5=2, 12-5=8, 2-1=1, 7-1=6.

బాలనేస్తాలు



ఏ భాగం ఎక్కడ?

బుజ్జాయిలూ... పై బొమ్మ బావుంది కదా. కానీ ఆ బొమ్మలో కొన్ని భాగాలు కనిపించకుండా అక్కడ కొన్ని సున్నాలు నెంబర్లేసి ఉన్నాయి చూశారుగా! కనిపించని భాగాలు ఆ పక్కనే ఉన్నాయి. ఏ నెంబరు దగ్గర ఏ భాగం పెట్టాలో మీరు చెప్పేయాలి.

జవాబు : 2,1,3,7,4,6,5

పదాలు నేర్చుకుందాం



	sp__ __ns	ee
	fl__ __er	oo
	ch__ __se	rr
	ca__ __ot	ow

హలో బుడుగులూ... ఇక్కడ మీకు కొన్ని బొమ్మలూ, వాటి ఎదురుగా పదాలు కనిపిస్తున్నాయి కదా. అయితే మధ్యలో అక్షరాలు మిస్సయ్యాయి. ఆ పక్కన బాక్సులోనేమో మిస్సయిన అక్షరాలు ఉన్నాయి. మీరు చేయాల్సిందేంటంటే ఆ బాక్సులోని అక్షరాలను ఆ ఖాళీలలో కరెక్టుగా రాయాలి.



సాయం చెయ్యొచ్చుగా

ఫ్రెండ్స్! ఈ గడుగ్గాయికి అక్కడున్న నాలుగు బొమ్మల్లో తన కంప్యూటర్ మౌస్ ఏదో తెలియటం లేదట. మీరు చెప్పి సాయం చెయ్యొచ్చుగా.

జవాబు :- 3వ బొమ్మ

బొమ్మను గీద్దామా

హేయ్ నేస్తాలూ... సీతాకోక చిలుక చాలా బావుంది కదూ. ఈ సగం బొమ్మను చూసి మిగతా సగం సీతాకోక చిలుకను వేయటమెలాగో నేర్చుకుందామా.





అట్టమీది కథ

బిగ్ బ్యాంగ్

- ఎస్. వెంకట్రావు

మనకు తెలిసిన విశ్వపరిణామ క్రమంలో శాస్త్రవేత్తలకు తెలియని కొన్ని విషయాలు ఉన్నాయి. ఈ మిస్సింగు లింకులను పట్టుకోవడం లార్జ్ హాడ్రన్ కొలైడర్ ద్వారా జరుపుతున్న పరిశోధన యొక్క ముఖ్య లక్ష్యం.

బిగ్ బాంగ్........ఈ మాట ఇప్పుడు మీడియాలో ప్రతిధ్వనిస్తోంది. పండితుల్లోనూ, పామరుల్లోనూ చర్చనీయాంశమైంది. విశ్వరహస్యాలు ఛేదించడానికి ఐరోపాలోని స్విట్జర్లాండ్-ఫ్రాన్స్ దేశాల సరిహద్దు వద్ద జరుగుతున్న పరిశోధన శాస్త్ర ప్రపంచంలో విపరీతమైన ఉత్కంఠను రేపుతుండగా, సామాన్యులు మాత్రం దీని వైపు అనుమానం, భయం, ఉత్కంఠలతో కూడిన ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రయోగం వల్ల మొత్తం భూగోళమే నాశనమైపోతుందన్న వదంతులు వ్యాపింపజేశారు. అయితే ప్రయోగం ప్రారంభమైన సెప్టెంబర్ 10 తేదీన అంతా సవ్యంగా జరగడంతో ప్రయోగం వల్ల నష్టమేమీ లేదనీ, ఇది మానవాళి మంచికోసం జరుగుతున్న ప్రయోగమనీ శాస్త్రవేత్తలు పదేపదే చెప్పిన విషయమే వాస్తవమని తేలిపోయింది.

ఏమిటీ ప్రయోగం? ఎందుకోసం?

విశ్వం పుట్టిన 'మరుక్షణం' (అంటే సుమారు ఒక సెకెనులో కొన్ని కోట్ల వంతు సమయంలో) ఏం జరిగిందో తెలుసుకోవడం, అనేక దశాబ్దాల ప్రయోగాల ఫలితంగా శాస్త్రవేత్తలు రూపొందించిన 'విశ్వరూపం' నమూనా సరైందో కాదో తెలుసుకోవడం, విశ్వంలో మానవునికి అంతుబట్టకుండా ఉన్న అగోచర పదార్థం (డార్క్ మేటర్), అగోచర శక్తి (డార్క్ ఎనర్జీ) గురించిన ఆనుపానులు గ్రహించడం ఈ ప్రయోగం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. దీనికి గాను శాస్త్రవేత్తలు 1300 కోట్ల సంవత్సరాల నాడు విశ్వం పుట్టినప్పుడు ఏర్పడిన పరిస్థితులను కృత్రిమంగా సృష్టిస్తారు. ఆ పరిస్థితులను అతి శక్తివంతమైన డిటెక్టర్లు గ్రహించి కంప్యూటర్లకు అందజేస్తాయి. వీటిద్వారా ఏడాదికి లక్ష 'డి.వి.డి'ల్లో పట్టే సమాచారం సేకరించబడుతుంది. ఈ సమాచారాన్ని శాస్త్రవేత్తలు విశ్లేషించి విశ్వరహస్యాలకు సంబంధించిన వివరాలు గ్రహిస్తారు. ఇదంతా కొన్ని సంవత్సరాలు పడుతుంది. బహుశా ఒక దశాబ్దం పైగా పట్టవచ్చు. దానికి ప్రారంభం సెప్టెంబర్ 10న జరిగింది. స్విట్జర్లాండ్‌లోని జెనీవాకు దగ్గరలో ఫ్రెంచ్-స్విస్ భూభాగాల గుండా వెళ్లే భూ గర్భంలో నిర్మించిన ఒక పరికరంలో ఈ ప్రయోగం ప్రారంభమైంది. ఈ పరికరం పేరు లార్జ్ హాడ్రన్ కొలైడర్ (ఎల్‌హెచ్‌సి). ఐరోపా అణు పరిశోధనా సంస్థ (సెర్న్) దీన్ని నిర్మించింది. భూమి లోపల 600 మీటర్ల లోతులో సుమారు 12 అడుగుల వ్యాసం గల సొరంగం తవ్వారు. ఈ సొరంగం 27 కిలోమీటర్ల దూరం ఉండి





వలయాకారంలో ఉంటుంది. 1983లో తవ్వకం ప్రారంభించిన సొరంగాన్ని 1988లో పూర్తి చేశారు. సొరంగం మొత్తాన్ని కాంక్రీటు చేశారు. సొరంగం లోపల వలయాకారపు గొట్టాలు రెండు ఒక దానికొకటి సమానాంతరంగా వెళ్లేట్లు అమర్చారు. 27 కిలోమీటర్ల పొడవు ఉండే ఈ గొట్టాలు నాలుగు చోట్ల మాత్రం ఒక దానితో ఒకటి కలుస్తాయి. మిగిలిన చోట్ల ఒక దాని పక్కగా మరొకటి వెళతాయి. ఈ గొట్టాలకు ఆరు చోట్ల డిటెక్టర్లు అమర్చారు. వీటిలో రెండు అత్యంత శక్తివంతమైన డిజిటల్ కెమెరాలున్నాయి. కొన్ని వేల కిలోగ్రాములు బరువున్న ఒక్కో కెమెరా ఎంత శక్తివంతమైనదంటే ఒక్క సెకనులో ఒక్కొక్క కెమెరా కోటికిపైగా ఫోటోలు తీయగలదు. సమాచారాన్ని పంపించేందుకు శాస్త్రవేత్తలు ఒక కంప్యూటర్ నెట్‌వర్క్ గ్రిడ్‌ను సృష్టించారు. ఈ గ్రిడ్ నుండి తరువాత కాలంలో రెండవ తరం ఇంటర్ నెట్‌ను రూపొందించే అవకాశాలున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇది ప్రస్తుతం అతి శక్తివంతమైన బ్రాడ్ బ్యాండ్ కన్నా 10,000 రెట్లు అధిక సామర్థ్యం కలిగి ఉంటుంది.

ఇంతటి శక్తివంతమైన, ఇంత పెద్ద భౌతిక శాస్త్ర పరిశోధనా పరికరం ప్రపంచంలో ఇప్పటివరకు తయారుచేయలేదు. దీని కోసం సుమారు 17,000 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. సొరంగంతో సహా మొత్తం నిర్మాణానికి 35 సంవత్సరాలు పట్టింది. లార్జ్ హాడ్రన్ కొలైడర్ పరికరం నిర్మాణానికి 20 ఏళ్లు పట్టింది. మొత్తం 80 దేశాలకు, 500 సంస్థలకు చెందిన వేలాది మంది శాస్త్రవేత్తలు ఈ పరిశోధనలో పాల్గొన్నారు.

లార్జ్ హాడ్రన్ కొలైడర్ పరికరంలోని రెండు గొట్టాల గుండా వ్యతిరేక దిశల్లో రెండు ప్రోటాను పుంజాలను వేగంగా పంపుతారు. ఈ ప్రోటాను పుంజాలు గుండ్రని మార్గంలో పయనించాలంటే ఎప్పటికప్పుడు వాటి దిశ మార్చాలి. అలాగా వాటి వేగాన్ని క్రమంగా పెంచుతూ కాంతి వేగానికి చేరువకు తీసుకుపోవాలి. ప్రోటాను పుంజాలు పయనించే గొట్టాల్లో ఉష్ణోగ్రత అత్యల్ప స్థాయిలో ఉండాలి. దీనికి గాను గొట్టాలకు ఒక్కోటి సుమారు 27 టన్నుల బరువున్న 1,600 సూపర్ కండక్టింగ్ అయస్కాంతాలు అమర్చారు.

లార్జ్ హాడ్రన్ కొలైడర్ ప్రధానమైన పని ప్రోటాను పుంజాల వేగాన్ని పెంచడం. సెప్టెంబర్ 10న ఉదయం 10:26 గం॥కు ఒక గొట్టం గుండా ప్రోటాను పుంజాన్ని విడుదల చేశారు. ఈ పుంజం 27 కిలోమీటర్ల పొడవు గొట్టంలో ఒక సెకనుకు కొన్ని వేల సార్లు పరిభ్రమిస్తుంది. అదే రోజున మరో అయిదు గంటల తరువాత రెండో గొట్టంలో వ్యతిరేక దిశలో మరో ప్రోటాను పుంజాన్ని విడుదల చేశారు. ప్రోటాను పుంజాలను విడుదల చేయడంలోనూ, గొట్టంలో పరిభ్రమింప జేయడంలోనూ శాస్త్రవేత్తలు విజయం సాధించారు. ఈ ప్రాథమిక ప్రయోగం విజయవంతం అయిన తరువాత ఇక శాస్త్ర వేత్తలు గొట్టంలో ఉష్ణోగ్రత పెరగకుండా ప్రోటాను పుంజాల వేగాన్ని పెంచుతూ పోతారు. క్రమంగా ఈ వేగం కాంతివేగానికి దగ్గరగా వెళ్లాలి. అంటే కాంతి వేగంలో 99.999999...శాతానికి చేరాలి. అంటే 27 కిలోమీటర్ల గొట్టంలో ప్రోటాను పుంజాలు సెకనుకు 11,000 సార్లు ప్రదక్షిణం చేస్తాయి. ఈ వేగం అందుకోడానికి కొన్ని మాసాలు పడుతుంది. అప్పుడు వ్యతిరేక దిశలో పయనిస్తున్న ప్రోటాను పుంజాలను నాలుగు చోట్ల, గొట్టాలు ఒకదానితో ఒకటి కలిసే చోట ఢీ కొట్టిస్తారు. పుంజాల్లోని ప్రోటానులు ఢీకొనాలంటే అవి ఒకదానికొకటి దగ్గరగా ఉండాలి. ప్రోటానులను దగ్గరికి చేర్చే పనిని సూపర్ కండక్టింగ్ అయస్కాంతాలు చేస్తాయి.



దాదాపు కాంతి వేగంతో పయనించే ప్రోటానుల ఢీకొన్నప్పుడు అవి విచ్ఛిన్నమవుతాయి. ఈ విచ్ఛిన్నాలనుండి అనేక రకాల ప్రాథమిక పదార్థ కణాలు ఏర్పడతాయి. వీటి జీవిత కాలం సెకనులో కోటివంతుకన్నా తక్కువ ఉంటుంది. అంటే మనం ఊహించలేనంత తక్కువ కాలంలో అవి అదృశ్యమవుతాయన్న మాట. అంత తక్కువ కాలం జీవించే ఈ కణాలను ఫోటోలు తీయడం, వాటికి సంబంధించిన భౌతిక లక్షణాలను గ్రహించడం ఒక పెద్ద, మహత్తర ప్రయోగమే.



శాస్త్రవేత్తలు ఈ ప్రయోగం నుండి ఏం ఆసిస్తున్నారో తెలుసుకోవాలంటే విశ్వం పుట్టుకకు సంబంధించిన కొన్ని విషయాల్లోకి వెళ్లాల్సి ఉంటుంది.

మహా విస్ఫోటనం (బిగ్ బాంగ్): విశ్వం పుట్టుక

విశ్వం పుట్టుక, దాని నిర్మాణం గురించి శాస్త్రవేత్తలు అనేక పరిశోధనల అనంతరం ఒక నమూనాను రూపొందిచారు. దాని ప్రకారం... నేటికి 13,700 కోట్ల సంవత్సరాల క్రితం ఒక మహా విస్ఫోటనం (బిగ్ బాంగ్)తో పదార్థం, స్థలం, కాలం ఒకే సారి పుట్టాయి. అదే విశ్వం. పదార్థం, స్థలం, కాలం మూడూ ఒకటే. ఒకటి లేకుండా మరొకటి ఉండదు. కనుక మనం పదార్థం అంటే ఈ మూడింటితో కూడినదిగా అర్థం చేసుకోవాలి.

విస్ఫోటనం సంభవించిన క్షణంలో విశ్వం అత్యంత సాంద్రతతో, అత్యంత వేడిగా ఉండేది. కాని కొద్ది క్షణాల్లోనే అంటే సెకనులో కొన్ని లక్షల వంతు సమయంలోనే అది చల్లబడడం ప్రారంభించింది. అప్పుడు పదార్థం క్వార్కులు, ఎలక్ట్రాన్లు అనే ప్రాథమిక కణాలుగా ఏర్పడింది. ఈ కణాలు విశ్వంలో పదార్థ నిర్మాణానికి ఇటుకలు వంటివి. క్వార్కుల జీవిత కాలం సెకనులో కొన్ని కోట్ల వంతు మాత్రమే. అంత తక్కువ సమయంలోనే అవి ప్రోటాన్లు, న్యూట్రాన్లుగా

మారిపోయాయి. ఈ ప్రోటాన్లు, న్యూట్రాన్లు కలిసి కేంద్రకాలుగా మారాయి. తరువాత పదార్థం మరింత వ్యాకోచించి, చల్లబడడం వల్ల పరమాణు కేంద్రకాలతో ఎలక్ట్రాన్లు కలిసి తొలి పరమాణువులు (ఆటమ్స్) ఏర్పడినాయి. పరమాణువులు ఏర్పడ్డానికి 3,80,000 సంవత్సరాలు పట్టిందని అంచనా. ముందుగా హైడ్రోజన్, హీలియం వాయువుల పరమాణువులు ఏర్పడినాయి. అందుకే నేటికీ విశ్వంలో ఈ రెండు వాయువులే అధిక శాతంలో ఉన్నాయి.

మరో 16 లక్షల సంవత్సరాలు గడిచే సరికి ఈ వాయువులు ఒక్కోచోట పోగుపడి నక్షత్రాలు, గెలాక్సీలుగా ఏర్పడినాయి. దాంతో విశ్వ పదార్థంపై గురుత్వాకర్షణ శక్తి అదుపు ఏర్పడింది. నక్షత్ర కేంద్రాల్లో క్రమంగా మరింత బరువైన కర్బనం, ఆక్సిజన్, ఇనుము వంటి మూలకాల పరమాణువులు ఏర్పడ్డాయి. ఈ పరమాణువుల కలయిక వల్ల అణువులు ఏర్పడినాయి. కొన్ని నక్షత్రాల చుట్టూ తిరిగే గ్రహాల్లో ఇటువంటి పెద్దపెద్ద అణువుల నుండి జీవులు ఏర్పడినాయి. మనకు తెలిసి అటువంటి జీవులు అభివృద్ధి చెందిన గ్రహం భూమి మాత్రమే. ఈ జీవుల నుండి పరిణామ క్రమంలో ఆలోచనా పరులైన మానవులు ఏర్పడ్డారు. మానవులు విజ్ఞానవంతులై ఈ విశ్వాన్ని గురించి పరిశోధించడం ప్రారంభించారు.

తెలియని పదార్థమే ఎక్కువ

ఇంతవరకు బాగానే ఉంది. కాని శాస్త్రవేత్తల్లకు అంతుబట్టని విషయం ఒకటి ఉంది. ఈ విశ్వాన్ని పరిశోధిస్తున్నప్పుడు మనం గ్రహించగలిగే పదార్థం అంతా కలిపితే...అంటే గ్రహాలూ, నక్షత్రాలూ, గెలాక్సీలు, వాటిమధ్య విస్తరించిన వాయుపదార్థం అంతా కలిపితే మొత్తం విశ్వపదార్థంలో 4 శాతం మాత్రమే ఉంది. మరి మిగిలిన 96 శాతం ఎక్కడుంది? మనకు తెలియదు. ఖగోళ భౌతిక శాస్త్రవేత్తల లెక్కల ప్రకారం మనకు కనిపించని ఈ 96 పదార్థంలో 70 శాతం శక్తి రూపంలోనూ, 26 శాతం పదార్థ రూపంలోనూ ఉంది. ఈ అగోచర శక్తిని 'డార్క్ ఎనర్జీ' అన్నారు. అగోచర పదార్థాన్ని 'డార్క్ మేటర్' అన్నారు. ఇవి విద్యుదయస్కాంత శక్తిని ప్రసరించవు గనుక అవి మన కంటికి ఏ విధంగానూ కనిపించవు. వాటి గురుత్వాకర్షణ శక్తి ద్వారా మాత్రమే మనం వాటిని గుర్తించగలం. విశ్వం యొక్క పరిణామంలో ఈ డార్క్ మేటర్, డార్క్ ఎనర్జీ యొక్క పాత్ర ఏమిటో ఇప్పటికీ శాస్త్రవేత్తలకు తెలియదు. కాని 96 శాతం ఉన్న ఈ అగోచర విశ్వంలోనే మన భౌతిక శాస్త్రానికి అందని అనేక విషయాలున్నాయని భావిస్తున్నారు.

సెర్న్‌లో జరుపుతున్న పరిశోధనలో 96 శాతం విశ్వానికి చెందిన ఈ డార్క్ మేటర్, డార్క్ ఎనర్జీకి సంబంధించిన విషయాలు ఆవిష్కృతమవుతాయేమోనని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

విశ్వ నమూనాలో మిస్సింగు లింకులు

ఇక మనకు తెలిసిన విశ్వపరిణామ క్రమంలో శాస్త్రవేత్తలకు తెలియని కొన్ని విషయాలు ఉన్నాయి. ఈ మిస్సింగు లింకులను పట్టుకోవడం లార్జ్ హాడ్రన్ కొలైడర్ ద్వారా జరుపుతున్న పరిశోధన యొక్క ముఖ్య లక్ష్యం. ఏమిటా మిస్సింగు లింకులు?

దీని గురించి తెలుసుకోవాలంటే శాస్త్రవేత్తలు రూపొందించిన విశ్వ నమూనా ఏమిటో తెలుసుకోవాలి. మాక్స్ ప్లాంక్ రూపొందించిన క్వాంటమ్ సిద్ధాంతం, ఐన్‌స్టీన్ యొక్క సాపేక్ష సిద్ధాంతాల మేలుకలయికతో విశ్వ నిర్మాణ నమూనా రూపొందించబడింది. దీని ప్రకారం....

విశ్వమంతా 12 రకాల ప్రాథమిక పదార్థ కణాలు, 4 రకాల ప్రాథమిక శక్తులతో నిర్మితమైంది. 12 రకాల ప్రాథమిక పదార్థ కణాల్లో రెండు గ్రూపులున్నాయి. ఒకటి క్వార్కులు, రెండు లెప్టాన్లు. ఆరు క్వార్కులు, ఆరు లెప్టాన్లు మళ్లీ మూడేసి జతలుగా విభజింపబడి ఉంటాయి.

నాలుగు రకాల శక్తుల్లో 1. బలహీన శక్తి, 2. బలమైన శక్తి, 3. విద్యుదయస్కాంత శక్తి, 4. గురుత్వాకర్షణ శక్తి. ఈ ప్రాథమిక శక్తులను కొన్ని రకాల కణాలు ప్రాథమిక పదార్థ కణాల్లో ఒకదాని నుండి మరోదానికి మోసుకు పోతుంటాయి. వీటిని బొసన్స్ అంటారు. అంటే పదార్థం శక్తిగా, శక్తి పదార్థంగా మారగానికి ఈ బొసన్లు తోడ్పడతాయన్నమాట.

అయితే శాస్త్రవేత్తల విశ్వ నమూనాలో ఒక చిక్కు ఏర్పడింది. మొత్తం 4 రకాల ప్రాథమిక శక్తుల్లో 3 రకాల శక్తులకు మాత్రమే బొసన్లు ఉన్నాయి. అంటే ఈ శక్తులు ప్రాథమిక పదార్థ కణాలతో ఇచ్చిపుచ్చుకోగలవు. కాని గురుత్వాకర్షణ శక్తికి మాత్రం బొసన్లు లేవు. ఈ మొత్తం ప్రాథమిక కణాలను ఒకదానితో ఒకటి కలిపి ఉంచే ఒక విశ్వ శక్తి ఉందని పీటర్ హిగ్స్ అనే ఆయన కొన్ని భౌతిక శాస్త్ర లెక్కల ద్వారా సిద్ధాంతీకరించాడు. ఆయన పేరుతో దాన్ని హిగ్స్ ఫీల్డ్ అని పిలుస్తున్నారు. ఈ హిగ్స్ ఫీల్డ్ నుండి శక్తిని ప్రాథమిక కణాలకు చేర్చి వాటికి పదార్థాన్ని సమకూర్చే బొసన్లు కూడా ఉన్నాయని ఆయన చెప్పాడు. వాటిని హిగ్స్ బొసన్లు అంటున్నారు. అంటే విశ్వంలోని ప్రాథమిక కణాలకు పదార్థాన్ని ఇచ్చే కణాలే హిగ్స్ బొసన్లన్న మాట. అందుకే వీటిని కొందరు "దేవుడు కణాలు" (గాడ్ పార్టికిల్స్) అని పిలుస్తున్నారు. అంటే వారి దృష్టిలో పదార్థానికి జన్మనిచ్చేది దేవుడు గనుక ఈ కణాలే దేవుడు అని అర్థం.

విషయమేమంటే మిగిలిన అన్ని ప్రాథమిక శక్తులు, ప్రాథమిక కణాలను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. కాని హిగ్స్ బొసన్లను మాత్రం ఇంతవరకు కనుగొన లేదు. లార్జ్ హాడ్రన్ కొలైడర్‌లో ప్రస్తుతం జరుగుతున్న పరిశోధనలో హిగ్స్ బొసన్లను కనుగొనగలమని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అయితే హిగ్స్ బొసన్లను కనుగొన లేరని ప్రఖ్యాత ఖగోళ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకిన్స్ సవాలు చేస్తున్నాడు. అలా కనుగొన లేరని 100 కోట్ల డాలర్ల పందె కూడా కాశాడాయన.

హాకిన్స్ సవాలు ఎలా ఉన్నా హిగ్స్ బొసన్స్ కనుగొంటే విశ్వానికి సంబంధించిన నమూనాలో ఒక పెద్ద మిస్సింగు లింకు దొరికినట్లేనని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అయితే ఒక వేళ హిగ్స్ బొసన్స్ ఉన్నా వాటి జీవిత కాలం సెకెనులో కోటివంతులకన్నా తక్కువ మాత్రమే. నిజానికి ప్రాథమిక పదార్థ







కణాల్లో అనేకం స్థిరత్వం లేనివే. శాస్త్రవేత్తలు వాటిలో చాలా వాటిని తొలుత ఖగోళ భౌతిక గణితం ద్వారా తెలుసుకుని తరువాత పరిశోధనల్లో ప్రత్యక్షంగా గుర్తించగలిగారు. మొత్తం విశ్వపదార్థానికి కారణమైన హిగ్స్ బొసన్స్ ను కూడా అలాగే కనుగొనగలమని వారు భావిస్తున్నారు.

హిగ్స్ బొసన్లే కాకుండా మనకు ఇప్పటివరకు తెలియని పదార్థ కణాలు ఇంకా అనేకం ఉండే అవకాశాలున్నాయి. మహా విస్ఫోటనం సంభవించిన క్షణంలో అటువంటి కణాలు ఏర్పడి అదృశ్యమై ఉంటాయి. సెర్న్ పరిశోధనలో ఇటువంటి అనేక రకాల ప్రాథమిక పదార్థ కణాలు కనుగొనబడవచ్చు. హిగ్స్ బొసన్స్ వంటి కణాలు కనుగొనబడితే విశ్వ పరిణామానికి సంబంధించి శాస్త్రవేత్తలు రూపొందించిన నమూనాకు బలం చేకూరుతుంది. అలా కాకపోతే ఈ నమూనాలో ఇంకా మిస్సింగు లింకుల కోసం వేట కొనసాగించాల్సి ఉంటుంది. అలా కాకుండా ఈ పరిశోధనల్లో శాస్త్రవేత్తల విశ్వనమూనాను తిరస్కరించే ఆవిష్కరణలు కూడా జరగవచ్చు. ఉదాహరణకు ఇంతకు ముందే చెప్పినట్లు అగోచరమైన 96 శాతం విశ్వానికి సంబంధించిన సమాచారంలోకి వెళితే అవి మన భౌతిక శాస్త్ర సూత్రాలకు అనుగుణంగా ఉండొచ్చు. లేక వాటిని తిరస్కరించవచ్చు. అప్పుడు మనం విశ్వనమూనానే తిరగరాయవలసి రావచ్చు.

అందువల్లనే లార్జ్ హాడ్రన్ కొలైడల్ పరికరంతో జరుగుతున్న పరిశోధనలు భౌతిక శాస్త్రంలో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. ఈ పరిశోధనలు విజయవంతం కావాలని ఆశిద్దాం.



చిన్న పిల్లల్లో కిడ్నీ సమస్యలు



ఆరోగ్యం

డాక్టర్ వి.చంద్రమోహన్,
యూరాలజిస్ట్ అండ్ ఆండ్రాలజిస్ట్,
మెడిసిటీ హాస్పిటల్స్, హైదరాబాద్.
ఫోన్ : 9848991666

మూత్రపిండాల వ్యాధులు పెద్దవాళ్లలోనే వస్తాయని చాలా మంది అనుకుంటారు. కానీ పిల్లల్లో కూడా మూత్రపిండాల సమస్యలు వస్తాయి. కాకపోతే తాము ఎదుర్కొంటున్న సమస్యలను వారు బయటికి చెప్పలేరు. అంతేకాక సమస్యలను కనుక్కోవడం కాస్త అసలు మూత్ర సంబంధ సమస్యలు ఏ వయసు వారిలో వస్తాయి? ఎందుకు వస్తాయి? అప్పుడు ఏం చేయాలి? అసలు ఈ సమస్యను గుర్తించడం ఎలా? వంటి విషయాలను ఈ వారం తెలుసుకుందాం.

పుట్టిన బిడ్డ నుంచి 12 ఏళ్ల వయసు వారిలో చాలా రకాల కిడ్నీ సమస్యలు రావొచ్చు. వీటిలో ఎక్కువ భాగం పుట్టుకతో వచ్చే వ్యాధులే. గర్భంలో ఉన్నప్పుడే అవయవాల అభివృద్ధిలో లోపం వుండడం వల్ల ఈ సమస్యలొస్తాయి. ఒక కిడ్నీతోనే పుడతారు. దీని వల్ల రోగులకు ఎలాంటి ప్రమాదముండదు. కానీ ఉన్న ఒక కిడ్నీ వల్ల ఏమైనా ఇబ్బందులున్నాయా? ఏదైనా అడ్డు వుందా? మూత్రాశయం బాగుందా? మూత్రం సరిగ్గా పోస్తున్నారా?.. ఇటువంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. పిల్లలు మూత్ర విసర్జన చేసేటప్పుడు, చేశాక ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా అనే విషయాలను తల్లిదండ్రులు అడిగి తెలుసుకోవాలి. 12 ఏళ్ల వరకు మూత్ర విసర్జనలో ఎలాంటి సమస్యలుండకూడదు.

కిడ్నీ సాధారణ పొజిషన్‌లో ఉండాలి. అలా కాకుండా కొంత మంది పిల్లల్లో అపెండిక్స్ దగ్గర, పొత్తి కడుపులో వుంటాయి. ఇవి నార్మల్‌గా వుంటే సమస్య లేదు. కానీ కిడ్నీ నుంచి మూత్రం సరిగ్గా రాక, బ్లాడర్ నుంచి వెనక్కి మూత్రం వెళ్లడం లాంటి సమస్యలను గమనించాలి.

కుడి వైపున్న కిడ్నీ, ఎడమ వైపున్న కిడ్నీ మధ్యలో కలిసిపోయే అవకాశం వుంటుంది. వీటి వల్ల ప్రమాదం లేదు. మూత్రం కిడ్నీ నుంచి కిందికొచ్చే మార్గం బ్లాక్ అయ్యిందా లేదా అనే విషయాన్ని గమనించాలి. రెండు కిడ్నీల కింది భాగం కలవడం వల్ల కిడ్నీ నుంచి వచ్చే నాళంలో ఎక్కడైనా అబ్‌స్ట్రక్షన్ వుంటే రాళ్లు ఏర్పడే అవకాశం ఎక్కువవుంటుంది. కిడ్నీలోనుంచి మూత్రం నాళంలోకి, అక్కడి నుంచి యూరెటర్‌లోకి వచ్చి మూత్రశయానికి చేరుకుంటుంది. యూరెటర్ కిడ్నీలకు అతుక్కుంటే దాన్ని పెల్వి యూరిక్ జంక్షన్ అంటారు. పుట్టుకతో సరిగ్గా అతుక్కోకపోతే మూత్రం ఆగి ఆగి వస్తుంది. ఇది చాలా సర్వసాధారణమైన కంజెనిటల్ కిడ్నీ వ్యాధి.

కిడ్నీలోంచి వచ్చిన మూత్రం కిడ్నీ నాళంలోకి ఆలస్యంగా వెళ్తుంది. అకస్మాత్తుగా తయారైన యూరిన్ సులభంగా వెళ్లడం సాధ్యం కాదు. రెండు లీటర్ల నీళ్లు తాగితే కిడ్నీలో ఉత్పత్తి పెరిగి, ఒకేసారి మూత్రం నాళంలోకి వెళ్లినా మూత్రం బయటికి రాదు. బయటికెళ్లడానికి ఆలస్యమౌతుంది. అప్పుడు ఆ రోగికి నొప్పి రావొచ్చు. అయితే నొప్పి రానంత మాత్రాన సమస్య లేదనుకోకూడదు. నొప్పి రాలేదంటే సైలెంట్‌గా కిడ్నీ దెబ్బతినే అవకాశముంది. చాలా మంది కిడ్నీలు బాగా పెరిగిన తర్వాత, కిడ్నీ అంతా మూత్రంతో నిండి, కిడ్నీ కండ కరిగిన తర్వాత డాక్టర్‌ను సంప్రదిస్తారు. తిత్తిని బయటికి తీస్తారు. ఒక్క కిడ్నీతో బతకాల్సిందే. దీనికి లాప్రొస్కోపిక్ లేదా ఓపెన్ సర్జరీ ద్వారా పైనొప్లాస్టీ సర్జరీ చేస్తారు. దీని వల్ల కిడ్నీ బాగా పని చేస్తుంది. మళ్లీ మళ్లీ ఇన్‌ఫెక్షన్ కలగదు. ముందు ముందు కిడ్నీ దెబ్బతినకుండా కాపాడుకోవచ్చు.

కిడ్నీలోనుంచి యురేటర్‌కు వచ్చే నాళం కొంచెం వంపుతిరిగివుంటుంది. కిడ్నీ నుంచి వచ్చే మూత్రం వెనక్కి వెళ్లకుండా ఈ ఏర్పాటు వుంటుంది. ఒక వేళ నాళం సరిగ్గా లేక మూత్రం కిడ్నీలోకి వెళ్తే దాన్ని రిఫ్లక్స్ డిసీజ్ అంటారు. ఇది కూడా పుట్టుకతోనే వస్తుంది. ఇది ఒక వైపుందా, రెండు వైపులుందా అనేది గమనించాలి. అంతేకాక రిఫ్లక్స్ ఎంత తీవ్రతతో వుందనేది ముఖ్యం. యురెటర్‌లో పైభాగానికి మాత్రమే పోతుందా ? కింది భాగానికి కూడా పోతుందా ? కిడ్నీ వరకు వెళ్తుందా? కిడ్నీని దెబ్బతీస్తుందా? కిడ్నీ పూర్తిగా దెబ్బతిన్నదా? అనే విషయాలను పరిశీలించాలి.

చిన్న పిల్లలకు యూరినల్ ఇన్‌ఫెక్షన్ వస్తే రిఫ్లక్స్ వ్యాధి వుందో లేదో తెలుసుకోవాలి. మూత్రాశయంలో రంగు నీళ్లు నింపి మూత్ర విసర్జన చేసేటప్పుడు ఎక్స్‌రే తీస్తారు. రంగునీళ్లు కిందికెళ్లాయని ఎక్స్‌రేలో కనుక్కుంటే రిఫ్లక్స్ డిసీజ్ వున్నట్లు. ఈ పరీక్షను మెచ్యురేటింగ్ సిస్టో యూరెత్రో గ్రామ్ అంటారు. రిఫ్లక్స్ వుండి, యూరిన్ ఇన్‌ఫెక్షన్స్ వస్తూ, కిడ్నీ దెబ్బతింటే, మళ్లీ మళ్లీ యాంటిబయాటిక్స్ వాడినా ఇన్‌ఫెక్షన్ వస్తుంటే సర్జరీ చేయాల్సి వుంటుంది.

బ్లాడర్ నుంచి బయటికి వెళ్లేదారిని బ్లాడర్ నెక్ అంటారు. బ్లాడర్ నెక్ తర్వాత పురుషాంగంలోని గొట్టం ద్వారా యూరిన్ బయటికొస్తుంది. బ్లాడర్ నెక్‌లో కొన్ని సార్లు కొత్తగా వాల్వ్ (కవాటాలు) తయారవుతాయి. ఇది సర్వసాధారణం. దీనివల్ల మూత్రం పోసినా మూత్రాశయం ఎంత వత్తినా వాల్వ్ అడ్డుకోవడం వల్ల ధార సన్నగా మారి యూరిన్ బయటికి రాలేదు. ఇలా మూత్రాశయం వత్తి వత్తి సామర్థ్యం తగ్గుతుంది. ఇలాగే వదిలేస్తే మూత్రాశయం కంట్రాక్షన్ చేయలేక చుక్కలు చుక్కలుగా మూత్రం వస్తుంది. ఇలాంటి పరిస్థితిలో పైనుంచి మూత్రం మూత్రాశయంలోకి రాలేక ఒత్తిడి పెరిగి కిడ్నీలు చెడిపోయే అవకాశముంటుంది. ఇలాంటి కేసులు ముందే గుర్తించి, చికిత్స చేయాలి.

కథ

డాక్టర్ దేవరాజు మహారాజు



మార్నింగ్ వాక్

పాత్రలు: తాత, నాయనమ్మ, స్పుత్నిక్ (మనవడు), శరత్.

అదీ నిజమేనమ్మా! తెలిసి, తెలిసీ చాలా తప్పులు చేశాం. నా ఇంట్లో కూడా ఓ కేసు అలాగే అయ్యింది కదా! బుద్ధిగా - చక్కగా చదువుకునే నాకొడుకేమయ్యాడు? ఈ లౌడ్‌స్పీకర్ల మోతలతో మతి చలించి పారిపొయ్యాడు. ఏమయ్యాడో, ఎక్కడున్నాడో, నైంటీన్ నైంటీ నుండి ఇప్పటికి ఎన్నేళ్ళయింది. జాడ తెలియలేదు. లేకపోతే మీ అబ్బాయిలాగా మా వాడూ ఏ అమెరికాలోనో ఉండేవాడు... ఇలా స్పుత్నిక్ లాంటి మనవడొకడు నాకు ఉండేవాడు. హూ.... ఫ్ (నిట్టూర్పు)



తాత, నాయనమ్మ 60-70 యేళ్ళ వయసు వారు. శరత్ వారి కుటుంబ మిత్రుడు. స్పుత్నిక్ పాతికేళ్ళ యువకుడు. అమెరికాలో పుట్టి పెరిగాడు. తొలిసారి భారతదేశం వచ్చాడు. సిటీ గ్రౌండ్స్‌లో వాకింగ్ చేస్తూ మాట్లాడుకుంటూ ఉంటారు. హైదరాబాద్‌లో అది ఒకప్పటి హుస్సేన్‌సాగర్ ప్రాంతం. 2020వ సంవత్సరం, ఓ ఆదివారం ఉదయం....

✠ ✠ ✠

తాత: ఒరేయ్ స్పుత్నిక్ రాజ్! మీ నానమ్మ కీళ్ళరిగి పోయేదాకా నడిచింది జీవితమంతా! నువ్వేమో నడవడమంటేనే భయపడతావ్. అసలు నడకనేదే లేదు. మీ తరానికి-సరేలే కబుర్లు చెప్పుకుంటూ మెల్లగా నడుద్దాం రా! అయినా మిమ్మల్ని అని ఏం లాభం? మీరు తింటున్న ఫాస్ట్ ఫుడ్‌లో ఏముంది? ఎనర్జీ, టాబ్లెట్లు మింగి కాలక్షేపం చేస్తున్నారు తప్ప ఏముంది మీలో....

నానమ్మ: ఏమండీ మీకు గుర్తుందా? మనరోజు లెంత బావుండేవి? ఏదీ 1999నాటి రోజులు! మీరూ నేనూ సర్వీసులో ఉన్నాం. ఆ రోజుల్లో ఎంచక్కా పది రూపాయలు పెడితే కిలో వంకాయలు... ఐదు రూపాయలు పెడితే కిలో ఉల్లిగడ్డలు. ఇప్పుడెన్ని రెట్లు పెరిగాయి ధరలు? అన్నిటికీ వేలు వేలు పెట్టాల్సి వస్తోంది.

ఉట్టి కరివేపాకు రెమ్మ ఐదు రూపాయలవుతుందనుకున్నామా? అవ్వ! (చేత్తో నోరు మూసుకుంది నానమ్మ)

తాత: (రహస్యం చెబుతున్నట్టు గొంతు తగ్గించి) ప్రణతీ నీకు గుర్తుందోయ్? మనం ఎగ్జిబిషన్‌కు వెళ్ళే వాళ్ళం. అక్కడ మిరపకాయ బజ్జీ... అబ్బ తలుచుకుంటే నోరూరుతోంది. ముప్పై రూపాయి పారేస్తే ఓ బజ్జీ వచ్చేది. మన శుభకర్ గాడు ఎన్ని లాగించే వాడూ? ఇప్పుడు బజ్జీ ముప్పయ్ రూపాయలా?

నానమ్మ: అవునూ మీకు బాగానే గుర్తుందే. ఇక్కడ టాంక్‌బండ్ మీద కూడా ఎన్నో సార్లు కూచుని తిన్నాం నీళ్ళలోకి చూసుకుంటూ.

స్పుత్ని: నీళ్ళా? అవెక్కడివి? టాంక్‌బండ్ ఎక్కడా?

తాత: (చిన్నగా నవ్వుకొని) నీకు తెలియదు లేరా! అదొక పెద్ద కథ

స్పుత్ని: అంటే ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్ళిపోవాల్సిందేనా?

నానమ్మ: నువ్వు జోకులెయ్యకు. నీకంతా నవ్వులాటగా వుంటుంది. నువ్వు పుట్టక ముందు ఇక్కడ హుస్సేన్‌సాగర్ అని పెద్ద చెరువోటి వుండేది. దాన్లో వినాయక విగ్రహాలు వేసి వేసి దాన్ని వినాయకసాగర్ చేశారు. ఇప్పుడదీ లేదు.

స్పుత్ని: చెరువా? మరి ఇక్కడ గ్రౌండ్ ఎలా అయ్యింది? దీన్ని సిటీ గ్రౌండ్స్ అంటున్నారు గదా? చెరువు గ్రౌండెలా అయ్యింది?

(వాకింగ్ చేస్తూ శరత్ ఎదురు వస్తాడు)

శరత్: హలో... హలో... భాయిసాబ్ వచ్చేశారా? అమెరికా మనవణ్ణి వెంట తెచ్చారే? ఏమోయ్ స్పుత్నిక్! రోజూ ఈ హోమియో తాతగారికిచ్చిన మాట నిలబెట్టుకున్నావే.....

తాత: వచ్చాడు పాపం....!! తన్నుకుంటూ తీసుకు రావాల్సొచ్చింది.

నానమ్మ: వాడికి పాపం ఒక గొప్ప అనుమానం వచ్చింది. చెరువెలా పూడుకుపోయింది? ఈ గ్రౌండ్ ఎలా తయారయ్యిందీ అని వీడికి మీరు చెప్పండి అన్నయ్య గారూ...

శరత్: ఓ అదా? (పెద్దగా నవ్వి) మేమే చేశామోయ్ - ఏం భాయ్‌సాబ్ మీరు చెప్పక పోయారా?మనమే కంకణం కట్టుకుని చేశాం కదా! చెరువును పూడ్చి గ్రౌండ్స్ చేశాం.

స్పుత్నీ: (విసుగ్గా అదే మరి. ఎలా చేశారు? విషయం చెప్పండసలు?

శరత్: అవి 1990 నాటి రోజులు బాబూ! కుర్రతనంలో చెయ్యాల్సిందంతా చేశాం. ఏ పండగ వస్తుందన్నా నెల రోజులు ముందు నుండే చందాలు వసూలు చేసేవాళ్ళం. పెద్ద పెద్ద దేవతా విగ్రహాలు చేయించే వాళ్ళం. పండగ పూజలు ఘనంగా చేయించే వాళ్ళం. పండగ రోజులు అయిపోగానే విగ్రహాలన్నీ హుస్సేన్‌సాగర్‌లో వేసేవాళ్ళం. కొత్త సినిమా రిలీజ్‌కు ముందు హీరో హీరోయిన్లు పెద్ద పెద్ద కటౌట్లు చేయించుకునేవారు. దురభిమాన సంఘాల వాళ్ళు వెళ్ళి వాటిని విరగ్గొట్టి ఆ చెరువులోనే వేసేవాళ్ళు. అలాగే ఇక ఎలక్షన్ల సమయంలో చెప్పనక్కరలేదు.

తాత: (గర్వంగా) ఆ రోజుల్లో మేమెంత ఆడితే అంతే! ఎవరూ ఎదురు చెప్పడానికి వీల్లేదు. ఒక్కో ఇంటికి వెళ్ళి వందంటే వంద, రెండొందలంటే రెండొందలు... చచ్చినట్టు ఇచ్చేవారు. చందా డబ్బులతో ఎంత ఎంజాయ్ చేశామనీ?

నానమ్మ: అదే ఈ రోజుల్లో అయితేనా? "పండగ చందా" అంటే చాలు రొబోట్‌తో మాడు పగలగొట్టిస్తారు.

తాత: (వెంటనే అందుకుని) ఆc ... ఆc ఆ భయంతోనే కదోయ్. ఇప్పుడా 'వృత్తి' మానేశాం. (వృత్తి అనేది ఒత్తి పలుకుతాడు)

అందరూ పెద్దగా నవ్వుతారు.

తాత: (కొనసాగిస్తూ) ఆ రోజుల్లో చేతినిండా చందా డబ్బులు.... తెగ జల్సా చేసే వాళ్ళం. పైగా ట్వంటీ ఫీట్, థర్టీ ఫీట్ వినాయక విగ్రహాలు చేయించేవాళ్ళం... ఇందులో కాలనీల మధ్య పోటీ వుండేవి. వాటి మధ్య రాజకీయాలు తిరిగేవి- అదొక సుడిగుండం.

శరత్: (కొంటెగా) మైకులు పెట్టి జనాల చెవులు బద్దలు కొట్టేవాళ్ళం.

తాత: (మరీ కొంటెగా) ముందు ఓ దేవుడి పాట వేసే వాళ్ళం. ఆ తర్వాత మా ఫర్మాయిష్ డిస్కో సాంగ్స్ వేసుకొని రోడ్ల మీద డాన్స్ చేసే వాళ్ళం. బూతు పాటలూ వల్గర్ డాన్సులు అంటూ మా దగ్గర పోలీసోళ్ళు మామూళ్ళు వసూలు చేసేవాళ్ళు- అది మరో కోణం.

శరత్: నడి రోడ్డున టెంట్లు కట్టి ట్రాఫిక్ ఆపేవాళ్ళం.

తాత: ఇటు టెంట్ వాళ్ళకు బిజినెస్ అయ్యేది. అటు కరెంట్ వాళ్ళకు, మైకు వాళ్లకు బిజినెస్ అయ్యేది. తలనొప్పి మాత్రలు బాగా అమ్ముడై మెడికల్ షాపుల్లో ఫుల్ గిరాకీ... (రహస్యం చెబుతున్నట్లుగా మెల్లగా) అయితే వీళ్ళందరి దగ్గర్నుండి మాకు కమీషనొచ్చేది.

స్పుత్నిక్: ఓహ్ ఆపండి! మీరు మీ డబ్బులు!! మీరు ఎలా అడుక్కు తిన్నారన్నది కాదు. చెరువు సంగతి అడిగితే మీ సంగతి చెప్తారేం?

తాత: అదేరా స్పుత్నీ! వినాయకుడి విగ్రహాలన్నీ తెచ్చి చెరువులో వేసేవాళ్ళం కదా? వేలు కాదు, లక్షలకు లక్షలు యేళ్ళకు యేళ్ళు.... అలా వేసి వేసి కష్టపడి పూడ్చాం.

శరత్: పూడ్చడానికి ఇంకా ఎన్నో చేశామోయ్. ఫ్యాక్టరీల నుండొచ్చే మలినాలు వదిలాం. చెత్తా చెదారం పోశాం. బుద్ధుడి శిలా విగ్రహం కూడా ముంచేశాం. పైకి తీసి తర్వాత ప్రతిష్టించార్లే... అది వేరే విషయం. పైగా ఎంతో మంది దూకి ఆత్మహత్యలు కూడా చేసుకోవడానికి కూడా ఆనాటి హుస్సేన్‌సాగర్ ఉపయోగపడేది.

స్పుత్నీ: (మధ్యలో అందుకొని) ఎంతయినా గ్రేట్ తాతయ్యా! యూ పీపుల్ డిజర్వ్ లాట్స్ ఆఫ్ కాంప్లిమెంట్స్. అయినా, తెలీకడుగుతాను... నగరంలో ప్రతి క్రాస్ రోడ్డులో ఏదో ఒక విగ్రహం వుండనే వుంది కదా! మరి అవెందుకు వదిలేశారూ?

శరత్: అరె, గొప్ప ఆలోచన! ఆ రోజుల్లో మాకిది తట్టనే లేదోయ్.

తాత: ఫ్చ్! తట్టక కాదు. అవన్నీ దేశం కోసం పాటు పడ్డ వాళ్ళ విగ్రహాలన్నారు. అందుకని వుండనిచ్చాం. అదీగాక, ఆ విగ్రహాలే లేకపోతే నగరం అందవిహీనంగా కనిపిస్తుందేమోనని... భయపడ్డాం. వాళ్ళంతా దేశానికే అలంకార ప్రాయులటc. సరే మన హైదరాబాద్‌కు కూడా అలంకారంగా ఉంటారని వదిలేశాం.

నానమ్మ: (ముక్కు ఎగబీలుస్తూ చిన్నగా ఏడుపు ప్రారంభిస్తుంది)

తాత: (ఆందోళనగా) ఏమిటీ ఏమయ్యింది? ఎందుకేడుస్తున్నావ్ ప్రణతీ?

నానమ్మ: మా అమ్మ గుర్తొచ్చిందండీ. ఆవిడ మీ పండగ లౌడ్ స్పీకర్ల చప్పుడు వినలేకనే గుండె ఆగి చచ్చిపోయింది పాపం! (నిట్టూర్పు)

తాత: ఆc ఏదో కాలం మూడింది చచ్చింది. మా లౌడ్ స్పీకర్ల చప్పుడుకేం చావలేదు.

నానమ్మ: (ఆవేశంగా) ఏం గాదు. హార్ట్ పేషంటని తెలిసి కూడా ఇంటి ముందు లౌడ్ స్పీకర్లు పెట్టారు. ఆవిడ బి.పి. పెంచారు. చివరకు చనిపోవడానికి కారణం అదే అయ్యింది. ఈ విషయం గుర్తొచ్చినప్పుడల్లా మీ ఆకతాయి పనుల్ని తిట్టుకోకుండా ఉండను.

శరత్: అదీ నిజమేనమ్మా! తెలిసి, తెలిసీ చాలా తప్పులు చేశాం. నా ఇంట్లో కూడా ఓ కేసు అలాగే అయ్యింది కదా! బుద్ధిగా - చక్కగా చదువుకునే నాకొడుకేమయ్యాడు? ఈ లౌడ్‌స్పీకర్ల మోతలతో మతి చలించి పారిపోయ్యాడు. ఏమయ్యాడో, ఎక్కడున్నాడో, నైంటీన్ నైంటీ నుండి ఇప్పటికి ఎన్నేళ్ళయింది. జాడ తెలియలేదు. లేకపోతే మీ అబ్బాయిలాగా మా వాడూ ఏ అమెరికాలోనో ఉండేవాడు... ఇలా స్పుత్నిక్ లాంటి మనవడొకడు నాకు ఉండేవాడు. హూ.... ఫ్చ్ (నిట్టూర్పు)

స్పుత్నిక్: అరె, చాలా కొత్త విషయాలు చెబుతున్నారే? చెప్పకుండానే అన్ని రకాల కాలుష్యాల గురించి చెప్పారు.

శరత్: పాతవే బాబూ అన్నీ మరిచి పోయిన సంగతులు. ఎందుకో జ్ఞాపకమొచ్చాయి. హూc - సరే... (కొంత దూరం వెళ్ళి) మళ్ళీ కలుద్దాం... నేను వస్తాను మరి... (మరో వైపు వెళ్ళిపోతాడు).

స్పుత్నిక్: బై. సీ యూ. నాకు తెలియని విషయాలు చాలా చెప్పారు. థాంక్స్.

స్పుత్నిక్: సరే, ఇప్పుడు నేనో పని చేస్తాను. పాతవి తలుచుకుంటూ బాధపడితే ఎలా? ఎంతయినా మీ వారసుణ్ణి మీ అడుగు జాడల్లో నడవాలి కదా! అందుకే ఒక మాస్టర్ ప్లాన్ వేశాను. వాకింగ్‌కు రన్నింగ్‌కు పరిమితమై పోకుండా గ్రౌండ్స్‌ను పెద్ద కమర్షియల్ కాంప్లెక్స్ చేస్తాను. లేదా అపార్ట్‌మెంట్స్ చేస్తాను. సిటీ అపార్టుమెంట్స్ అని పేరు పెడితే హాట్‌కేక్స్‌లా అమ్ముడై పోతాయి. డాడీతో ఈ విషయం వెంటనే డిస్కస్ చెయ్యాలి. వండర్‌ఫుల్ ఐడియా- నా ఇండియా ట్రిప్ వృధా కాలేదు. పదండి... పదండి... డాడీకి ఫోన్ చేద్దాం.

నానమ్మ: (నిట్టూర్చి) ఫ్చ్! ఎవడి పిచ్చి వాడిది. అసలు ఎవరు ఎటుపోతున్నారో ఎవరికీ తెలియడం లేదు. సరదాగా నీళ్లలోకి చూస్తూ, మిరపకాయ బజ్జీలు తింటూ సాయంత్రాలు గడపాలంటే ఇటు బంగాళాఖాతానికో, అటు అరేబియా సముద్రానికో పోవాల్సి వచ్చేట్లుంది. (నిట్టూర్చి) ఇంకా ఎలాంటి రోజులొస్తాయో ఏమో.

స్పుత్నిక్: అవును బే ఆఫ్ బెంగాల్‌కి వెళ్ళాలంటే వెళతాం... ఎంత సేపూ? ఫ్లయిట్ మీద? ట్వంటీ ఫస్ట్ సెంచరీలో బతుకుతున్నాం గ్రాండ్ మా. అది గుర్తుంచుకో.

నానమ్మ: (వ్యంగ్యంగా) హూ. పోతూనే ఉన్నాం. ఏం పోవడం యేట్లోకి? గాలీ నీరు లేని సమాజంలోకి పోతున్నాం. అందరం అది గుర్తుంచుకోవాలి!

తాత: ఏమిటోయ్ పొద్దునే మూడ్ పాడయ్యిందా? వేదాంతం మాట్లాడ్తున్నావ్? పద ఇంటికెళదాం. వాకింగ్ చాలు ఈ రోజుకు.

నానమ్మ: లేదండీ! ఎవరికి వారు ఆలోచించాల్సిన విషయం గుర్తు చేస్తున్నాను.

ఎంతయినా టీచర్ని కదా? బుద్ధెక్కడికి పోతుంది? (అందరూ పొడి పొడిగా నవ్వుకుంటారు. దూరం నుండి సిగ్నల్స్.... వినిపిస్తాయి)

స్పుత్నీ: అదిగో కార్లోని రోబోటేదో పిలుస్తోంది. వెళదాం పదండి

✲

ది లవబుల్ కపూర్... 'శశి'!

డా॥ జె.పి. వైద్య

రోటీ- కపడా ఔర్ మకాన్ -దీవార్ - కభీ కభీ -కాలాపత్థర్ - షాన్- ఈమాన్ ధరమ్ - త్రిశూల్ - సుహాగ్ - దో ఔర్ దో పాంచ్ -నమక్ హలాల్ - అకేలా- సిల్ సిలా!

దీవార్‌లో అమితాబ్- శశీవి పోటాపోటీ పాత్రలు. పెద్దన్న -తమ్ముడుగా మాఫియా డాన్ - పోలీసాఫీసర్‌గా వేశారు వాళ్లిద్దరూ! మేరు పర్వతంలా ఎదిగిన అమితాబ్-నాదగ్గర ఎనలేని డబ్బూ దస్కం ఉంది... కార్లూ - బంగళాలున్నాయి... విలాసం నా వేలిచివర్లో నాట్యమాడుతూ ఉంటుందెప్పుడూ! బోడి పోలీస్ నౌకరీ చేసేవాడివి! ఏముంది? ఏముంది నీదగ్గర?' అని 'భారీ భర్కమ్' డైలాగ్‌కు - పోలీస్ ఆఫీసర్‌గా శశికపూర్ 'సింగిల్ లైన్ పంచ్ జవాబు' వస్తుంది అతి సౌమ్యంగా!

..... 'నా దగ్గర అమ్మ ఉంది' (మేరే పాస్ మా హై!)

అందరు 'హీరో'ల్లా అతడూ అందగాడే!

ముఖ్యంగా మేనరిజమ్స్ మారకున్నా నవ్వుల్లో స్వచ్ఛత, పారదర్శకత, ఆత్మవిశ్వాసం... వెరసి ఒక 'స్పార్క్'!

'బక్ టూత్ స్మైల్ ఆయనదీ'... అన్నారు విమర్శకులు!

'ఇన్ని సినిమాల్లో చేశాడూ! అవార్డులెన్ని? అని ప్రశ్నించారు కొందరు. ఆయన పట్టించుకోలేదు.

మళ్లీ 'స్పార్క్' ల్లాంటి నవ్వులు వెదజల్లి స్టైల్లో కదిలిపోయాడు. అదేపనిగా వేటాడి, వెంటాడి ప్రశ్నలడిగే తత్వం వున్న కాలమ్ రైటర్ ఇరకాటంలో పెట్టే ప్రశ్నల బాణాలేసింది.

'ఆడవాళ్లల్లో మీకు అమితంగా ఆకర్షించేదేమిటి?' అన్నది ప్రశ్న! ఆయన చిన్నగా తల ఎత్తి పరికించి చూశాడు. సూటిగా కళ్లల్లోకి చూస్తూ జవాబిచ్చాడు.

-'కళ్లు... పెదవుల మీది నవ్వులూ... పసందైన వంపులూ...' కాలమ్ రైటర్ క్షణాల్లో మాయమైపోయింది.

ఆయన నవ్వుకుంటూ కారెక్కి స్వయంగా డ్రైవ్ చేస్తూ తన 'హ్యాపీ హోం' వైపు కదలిపోయాడు. అక్కడ 'జెనిఫర్ కెండెల్' ఎదురు చూస్తున్నది.

ఆయన రాజ్ కపూర్, షమ్మీర్‌ల చిన్న తమ్ముడు 'శశి కపూర్'.

కరిష్మాకపూర్, కరీనా కపూర్ ల తండ్రి. 'రణధీర్ కపూర్' కు బాబాయి. నీతూ సింగ్ భర్త రిషికపూర్ కు బాబాయి... 'శశికపూర్'!

బ్రిటిష్ నటి 'జెనిఫర్ కెండెల్ 'భర్త' శశికపూర్'.

ఎందరికో ఆత్మీయుడైన 'శశి'!

నీలి కళ్ల స్వాప్నికుడు- ది గ్రేటెస్ట్ షోమాన్ ఆఫ్ ఇండియా రాజ్ కపూర్ అసాధారణ ప్రజ్ఞాపాటవాలున్న కళాకారుడు.

స్వయంగా సంగీతం గురించి ఎంతో తెలిసిన వాడు. సినీ ప్రేక్షకుల నాడి తెలిసినవాడు. భారతీయ చార్లీచాప్లిన్‌గా అందరినీ మెప్పించిన అద్వితీయ నటుడు.

షమ్మీ కపూర్ ఒక జమానాలోని శ్వాషింగ్-పుషింగ్-జంపింగ్-టాలెంటెండ్ హీరో. ఆయన్ను కాపీ కొట్టేవాళ్లు బస్తాల కొద్దీ వచ్చారు. చిరుగుల చిల్లునుంచి జారిపోయినట్టు మాయమైపోయారు.

వాళ్ల నాన్నగారిది 'భారీ కాయం'... ఒక తరంలో సినీ దునియానూ, నాటక ప్రపంచాన్నీ శాసించిన 'మహాకాయం' ఆయనది. 'మొగల్-ఎ-ఆజమ్'లో ట్రాజెడీ కింగ్ 'దిలీప్ కుమార్'తో పాటు 'ప్యార్ కియా తో డర్నా క్యా' అన్న 'మధుబాల' ను దడదడ లాడించి మనందరి మన్ననలు పొందిన 'షహెన్‌షా - అక్బర్' పాత్రలో చరిత్ర సృష్టించిన 'పృధ్వీరాజ్ కపూర్' తనయులు 'రాజ్ కపూర్'- షమ్మీ కపూర్'- 'శశి కపూర్'!

శశి కపూర్‌లో 'రాజ్ కపూర్'లోని దర్శకుడూ, 'షమ్మీ కపూర్'లోని డ్యాషింగ్, పుషింగ్ ఉండక పోవచ్చు. కానీ, నటనాశక్తి మెండుగా ఉండేది. పృధ్వీరాజ్ కపూర్ వెంట 'పృధ్వి' థియేటర్‌లో - కెండెల్ గ్రూప్‌తో షేక్స్పియర్ నాటకాలు వేయక ముందే చిన్నారి పాత్రలో వెండితెర మీద చిన్నపాటి వెలుగులు చిందించాడు 'శశికపూర్'!

1948లో 'ఆగ్' - 1951లో 'ఆవారా'లో 'రాజ్ కపూర్' బాల్యం వేషాలేసింది 'శశికపూరే'!

1955లో రాజ్ కపూర్ 'శ్రీ420' వచ్చింది. అది శ్వేత శ్యామ వర్ణ చిత్రంలో తలమానికం! మొత్తం 12 పాటలు! అన్నీ ఆణి ముత్యాలే! అందులో ఒక గీతం 'ప్యార్ హువా ఇక్‌రాల్ హువా'!

నేటికీ అది ఒక అద్భుతమైన దృశ్య కావ్యం!

వర్షపు హోరులో గొడుగు పట్టుకొని సాగింది ప్రయాణం జోరు!

ఆ గీతంలో 'తుమ్ న రహోగే, హమ్ న రహేంగే

రహ్ జాయేంగి నిషానియా' అనే పంక్తులున్నాయి (రేపు నీవుండవూ... నేనూ ఉండను.. మిగిలి ఉంటాయి. కేవలం ఈ జ్ఞాపకాలే) ... ఆ చిత్రీకరణలు నేటికీ హిందీ చిత్ర సామ్రాజ్యపు పాఠ్యగ్రంథాల్లోని సువర్ణాక్షరాల్లాంటివి.

కెమెరా వర్షం ధారలో 'రెయిన్ కోట్లు' వేసుకుని బుద్ధిమంతుల్లా 'ఫుట్ పాత్' మీద నడచి వెళ్తున్న ముగ్గురబ్బాయిల మీద కేంద్రీకరింపబడుతుంది. ఆ ముగ్గురబ్బాయిలూ 'కపూర్' కుటుంబీకులే!

శశి కపూర్, రణధీర్ కపూర్, రిషికపూర్ ఆ ముగ్గురు పిల్లలు. అందుకే 'వారి' కోసం శశికపూర్ బాబాయ్ కన్నా 'మిత్రుడే' ఎక్కువై ఉండిపోయాడు. పంజాబీ జీవన పద్ధతుల్లో 'హర్షోల్లాసం' పాలెక్కువ... ఇంకో తరహా రసాలూ 'కాస్త' ఎక్కువే!

శశి కపూర్ తొలి ముఖ్యమైన సినిమా రోల్ 'ధర్మపుత్ర'లో నాయకుడిది. అది బి.ఆర్ చోప్రా సినిమా! బి.ఆర్ పిక్చర్స్ అంటే బాలీవుడ్‌లోని విందు భోజనాలు!

1960 నుండి 1980 తొలి రోజుల వరకు శశి కపూర్ 'బాలీవుడ్'ను తన స్వంత స్టైల్లో ఏలుకున్నాడు.

'సత్యం-శివం- సుందరం' రోజుల్లో అన్న 'రాజ్‌కపూర్' - తమ్ములుంగారైన 'యమ బిజీ స్టార్' శశి కపూర్ 3- షిఫ్టుల్లో సాగించిన షూటింగ్ గమనించి తమాషాగా 'ఏవిరోనయ్యా! వీళ్లంతా ట్యాక్సీగాళ్లు! క్షణం తీరిక లేకుండా తిరుగుతున్నారు' అని మెచ్చుకున్నాట్ట(!)

అమితాబ్ బచ్చన్ హిందీ చిత్రసీమలో 'చక్రవర్తులకు చక్రవర్తి'! మిలీనియం స్టార్!

ఆయన సరదాగా 'ఉఫ్' అని ఊదేసినా - 'ఏముందో అటువైపు' అని పిచ్చిగా పరుగెత్తి తడుముకుంటూ పిచ్చోళ్లలా కదిలేవారు జనం!

అలాంటి అమితాబ్ శశి కపూర్ జోడీ చాలా చాలా పాపులర్!

'షోలే'లో అమితాబ్ - ధర్మేంద్ర జోడికి దీటుగా దాదాపు 13 సినిమాల్లో అమితాబ్ - శశికపూర్ కలిసి నటించారు. దాదాపుగా అన్నీ హిట్లే! కొన్ని సూపర్ డూపర్ హిట్లు!

రోటీ- కపడా ఔర్ మకాన్ -దీవార్ - కభీ కభీ -కాలాపత్థర్ - షాన్- ఈమాన్ ధరమ్ - త్రిశూల్ - సుహాగ్ - దో ఔర్ దో పాంచ్ -నమక్ హలాల్ - అకేలా- సిల్ సిలా!

దీవార్‌లో అమితాబ్- శశీవి పోటాపోటీ పాత్రలు. పెద్దన్న -తమ్ముడుగా మాఫియా డాన్ - పోలీసాఫీసర్‌గా వేశారు వాళ్లిద్దరూ!

మేరు పర్వతంలా ఎదిగిన అమితాబ్-నాదగ్గర ఎనలేని డబ్బా దస్కం ఉంది... కార్లూ - బంగళాలున్నాయి... విలాసం నా వేలిచివర్లో నాట్యమాడుతూ ఉంటుందెప్పుడూ! బోడి పోలీస్ నౌకరీ చేసేవాడివి! ఏముంది? ఏముంది నీదగ్గర?' అని 'భారీ భర్కమ్' డైలాగ్‌కు - పోలీస్ ఆఫీసర్‌గా శశికపూర్ 'సింగిల్ లైన్ పంచ్ జవాబు' వస్తుంది అతి సౌమ్యంగా!

..... 'నా దగ్గర అమ్మ ఉంది' (మేరే పాస్ మా హై!)

అది రచయితలు 'సలీం -జావెద్ ' పుణ్యమో, దర్శకులవారి అదృష్టమో, తెలియదుకానీ హాల్ అంతా మిన్ను ముట్టినంత చప్పట్లు-ఈలలూ వేసి మనం 'మాతృభక్తి -సినిమా భక్తి' చాటుకున్నాం.

1975లో శశికపూర్‌కు 'దీవార్' కోసం 'బెస్ట్ సపోర్టింగ్ నటుడి'గా ఫిలింఫేర్ అవార్డు వెదుక్కుంటూ వచ్చి వొళ్లో వాలింది.

అలాగే 1986లో జాతీయ పురస్కారం 'న్యూఢిల్లీ టైమ్స్' కోసం లభించింది. ఆ విషయం అందరికీ తెలియకపోవచ్చు.

ఆగ్ (48) లో 'చిన్నారి కేవల్' - ఆవారా (51) లో 'చిన్నారి రాజ్ కపూర్'గా వేసిన శశికపూర్ కు పేరు ప్రఖ్యాతులు సంపాదించి పెట్టిన


ఇప్పటి శశి

సినిమాలు ఎన్నో ఉన్నాయి. కొన్నింటిని తలచుకుందాం.

వక్త్ (65) - షేక్స్పియర్ వాలా (65) - ప్రెట్టీ పోలీ (67) -బొంబే టాక్రే (70) రోటీ కపడా ఔర్ మకాన్ (74) -దీవార్ (75) - కభీ కభీ (76) -త్రిశూల్ (78) - సత్యం శివం సుందరం (78) - కాలా పత్థర్ (79) -షాన్ (80) -క్రాంతి (81) -సిల్ సిలా (81) -నమక్ హలాల్ (82) -హీట్ అండ్ డస్ట్ (82) - న్యూఢిల్లీ టైమ్స్ (86) - గలివర్స్ ట్రావెల్స్ (96) - జిన్నా (98) - సైడ్ స్ట్రీట్స్ (98). ఆయన నిర్మించిన సినిమాలు రెండు - అజూబా (91) -36 చౌరంగీ లేన్ (81). దర్శకత్వం వహించి చేతులు కాల్చుకున్న ఒకే ఒక సినిమా 'అజూబా'. 'మర్చెంట్ ఐవరీ ప్రొడక్షన్స్' కు శశి ఆత్మీయుడు.

'న్యూఢిల్లీ టైమ్స్' కోసం 'జాతీయ పురస్కారం' అందుకున్న క్షణాల్లో ఆయన ఆనందంగా ఉబ్బితబ్బిబ్బు కాలేదు. పైపెచ్చు '36 చౌరంగీ లేన్ ' లోని అద్భుత పాత్ర పోషణకు ఈయన అర్ధాంగి 'జెనిఫర్'కు అవార్డ్ వస్తే బావుండు అని మధనపడ్డాడు.

సాధారణంగా హ్యాపీ గో లక్కీ పాత్రలో రాణించిన 'శశి'కి తొలి విజయం, గుర్తింపు ఇచ్చిన సినిమా 'జబ్ జబ్ ఫూల్ ఖిలే' -నటి 'నందా'. ఆమె మరాఠీ సినీ నాయకుడు 'మాస్టర్ వినాయక్' ముద్దుల కూతురు. అందులోని 'పర్‌దేసియోం సే న అఖియా మిలానా' - 'ఏక్ తా గుల్ ఔర్ ఏక్ థి బుల్ బుల్.. దోనో చమన్ మే రహ్తే థే' విపరీతమైన ప్రజాదరణ పొందిన గీతాలు. చిత్రం సూపర్ డూపర్ హిట్.

'ఆమ్నే సామ్నే'లో షర్మిలా కన్నా 'వక్త్'లో షర్మిలా ఎప్పటికీ జ్ఞాపకం ఉండిపోతుంది. 'వక్త్'లో 'శశి' కి కారు డ్రైవింగ్ నేర్పించే సీన్ చాలా మందికి కితకితలు కలిగించింది.

'షర్మిలీ' లో రాఖీ డబుల్ రోల్! 'ఖిల్తే హై గుల్ మహా' అని శశి ఆకట్టుకున్నాడు. 'ఓ మెరీ షర్మిలీ అని వేడుకున్నాడు. 'ఆజ్ మద్‌హోష్ హువా జాయేరే మెరామన్' అంటూ ప్రేమ గీతాలూ పాడాడు.

రాఖీ తేనె కళ్లతో పాటు కాస్తంత వొంపులు చూయించిన సినిమా అదే! ఆ తర్వాత ఆమె డిగ్నిఫైడ్ పాత్రల్లోనే జీవించింది.

తెలుగులో చాలా ఏళ్ల క్రితం 'ప్రేమించి చూడు' వచ్చింది. తమిళంలో 'కాదలిక్క నేరమిల్లై' కాపీ అది. తెలుగులో 'అక్కినేని' దూకుడుగా చేసిన పాత్రను హిందీలో 'ప్యార్ కియే జా' లో శశి హుషారుగా నటించి మెప్పించాడు.

జీవితం ఒక అందమైన కథలాంటిది. ఎంత పొడవుందో అనే దానికన్నా ఎంత బావుందీ అన్నదే ముఖ్యం!

'కపూర్' లకు తినడం- తాగడం- విందులూ- వినోదాలు బహు ఇష్టమైనవి. రాజ్, షమ్మీ, డబ్బూ (రణధీర్), రిషీ ఎంత వ్యాకోచం చెందినా 'జెన్నిఫర్' నిశితమైన చూపుల్లో 'శశి' ట్రిమ్ గానే ఉండేవాడు. ఆవిడ 84లో క్యాన్సర్ తో పోయాక, శశి శరీరం 'అదుపాజ్ఞలు' తప్పింది. కొందరి దృష్టిలో అదీ ఓ అందమేమో!

మనం రసిక రాజులం!

మన కళ్లు చూసే అందాలు -వాటి ముచ్చట్లు వేరే!

అందుకే మనకు 'శశి '- ది ఓల్డ్ జంటిల్ మాన్ అయినా ఇష్టమే!

మనం మటుకు 'ది ఓల్డ్ అండ్ బోల్డ్ సినీ లవర్స్' కామా ఏమి?

❊

దీనిపై మీ స్పందనను రచయితకు తెలియచేయవచ్చు.
ఫోన్ : 08732223622





వీరి వీరి గుమ్మడి పండు
జవాబు

వీరి వీరి
గుమ్మడి
పండు
వీరి పేరు
జాకీచాన్



గోరఖ్‌పూర్

ఉత్తరప్రదేశ్‌లో రాప్తి నదీ తీరాన వెలసిన పురాతన నగరం గోరఖ్‌పూర్. ఇది పేరుకు పురాతన నగరమే కానీ ఆధునికత అడుగడుగునా కనిపిస్తుంది. పూర్వం గోరఖ్‌పూర్‌ను గోరక్షపూర్ అని పిలిచేవారని, దీనికో కథ ఉందని. కౌరవులు వనవాసం చేసినపుడు అర్జునుడు ఉత్తరుని సారథ్యలో గోవులను రక్షించించింది ఇక్కడేనని చెపుతారు. అలాగే గోరఖ్‌నాథ్ అనే మహాపురుషుడు ఈప్రాంతంలో జీవించాడని అందువల్లనే దీనికి గోరఖ్‌పూర్ అని పేరు వచ్చిందని మరో కథనం కూడా ప్రచారంలో ఉంది. మరి ఇక్కడ చూడదగిన ప్రదేశాలేంటో...వాటి వివరాలేంటో... ఈ వారం



ఇక్కడొక తటాకం ఉంది. దీని విస్తీర్ణం ఆరేడు కిలోమీటర్లు ఉంటుంది. ఊరి బయటేమో నాలుగు కిలోమీటర్ల పరిధిలో, బాగా ఎత్తైన చెట్లతో నిండిన దట్టమైన అడవి చూపరులకు కనువిందు చేస్తుంది. ఇంకా ఇక్కడ ఈశాన్య రైల్వే కేంద్రం, వైమానిక దళ కేంద్రం, ఫెర్టిలైజర్ కార్పొరేషన్ వారి అతిపెద్ద కార్యాలయం ఉన్నాయి. ప్రఖ్యాతి గాంచిన గోరఖ్‌పూర్ విశ్వవిద్యాలయం కూడా ఇక్కడే ఉంది. స్వతంత్ర పోరాటాన్ని మలుపు తిప్పిన చౌరీచౌరా కూడా గోరఖ్‌పూర్ జిల్లాలోనిదే.

అటవీ విహారం

గోరఖ్‌పూర్‌కు దగ్గర్లోనే ఉత్తర బీహార్ అడవులున్నాయి. ఇక్కడి చెట్లు చాలా ఎత్తుగా ఉంటాయి. అక్కడి ప్రజలు ఆ చెట్ల చివరిదాకా ఎక్కుతుంటే చాలా ఆశ్చర్యంగా, భయంగా కూడా ఉంటుంది. అది హిమాలయ ప్రాంతం కావటం వల్ల టేకు, సాల్, దేవదారు చెట్లతో దట్టంగా అల్లుకుని ఉంటుంది. ఈ అడవుల్లో తోడేలంత సైజులో ముంగిసలు, కుందేళ్లు ఇంకా కొన్ని రకాల జంతువులు ఎక్కువగా కనిపిస్తాయి. అయితే







ఇక్కడ భరించలేని చలి ఉంటుంది కాబట్టి రాత్రి పూట ఎక్కువసేపు వుండలేము.

వాల్మీకి ఆశ్రమం

తమసా, గండకి, సరవణీ నదుల సంగమ ప్రదేశంలో చిన్న కొండ మీద వాల్మీకి ఆశ్రమం ఉంది. వాల్మీకి మహాకావ్యమైన రామాయణ రచన జరిగింది ఇక్కడేనని కొందరి విశ్వాసం. వాల్మీకి ఆశ్రమం గురించి మరో వాదన కూడా ఉంది. అదేమంటే వాల్మీకి ఆశ్రమం ఉత్తర ప్రదేశ్‌లోని బితూర్ అనే ప్రదేశంలో ఉందనీ, దీని పూర్వనామం "బ్రహ్మతీర్థ"మనీ, ఇక్కడ రామాయణ రచన సాగిందనీ అంటారు. ఈ బితూర్ కాన్పూర్‌కు 34 కిలోమీటర్ల దూరంలో గంగానదీ తీరంలో ఉంది.

ఇక్కడి తలుపులకు కళ్లుంటాయ్

ఆశ్రమం చుట్టూ కంచె ఉంది. తవ్వకాలలో లభించిన వస్తువులను ఒక షెడ్డులో భద్రపరిచారు. ఈ షెడ్డు తలుపులకు రెండు నేత్రాలు చిత్రించి ఉంటాయి. ఇక్కడి శిల్పాలలో ముఖ్యమైనది నల్లరాతితో సున్నితంగా నగిషీలు చెక్కి, సగభాగం విష్ణువు, సగభాగం శివునిగా మలచిన విగ్రహం. విష్ణువుకు సుదర్శన చక్రం, గద, శివునికి త్రిశూలం ఉన్నాయి. ఇంకా చాలా శిల్పాలు ఉన్నాయి కానీ, అవేవీ చూపరులను ఆకట్టుకోవు.

ఈ ప్రదేశానికి కొద్ది దూరంలో లవకుశులు శ్రీరాముని యాగాశ్వాన్ని బంధించిన ప్రదేశం, లక్ష్మణునితో లవకుశులు యుద్ధానికి సిద్ధమైన ప్రదేశం, లవకుశులు జన్మించిన స్థలం, లవకుశుల విద్యాభ్యాసం జరిగిన చోటు అని



చెప్పుకునే ప్రదేశాలన్నీ వరుసగా మనకు కనిపిస్తాయి. వాల్మీకి రచించిన రామాయణ గాథను లవకుశులు ఇక్కడే తొలిసారిగా గానం చేశారని కూడా చెపుతారు. ఈ ప్రదేశాలన్నీ వరుసగా చూస్తున్నప్పుడు రామాయణ కథ మొత్తం మన కళ్లముందే జరిగిన అనుభూతి కలుగుతుంది.

గోరఖ్‌నాథ్ మందిరం

గోరఖ్‌నాథుల మందిరం దాదాపు 25 ఎకరాల విస్తీర్ణంలో, విశాలమైన పాలరాతి కట్టడం. దీని ముందు పెద్ద కోనేరు, చుట్టూ పూల తోటలతో నిండి ఉంటుంది. కోనేరు పక్కనే నిద్రిస్తున్నట్టుగా ఉన్న భీముని విగ్రహం ఉంది. విశాలమైన మందిరంలో గోరఖ్‌నాథుని పాలరాతి విగ్రహం, ఉత్తర దిక్కుగా అఖండంగా అగ్నిహోత్రం వెలుగుతూ ఉంటుంది. పడమర దిక్కున ఉన్న మూడు మందిరాల్లో మొదటి దానిలో శివుడు, రెండవదానిలో గుచ్చబడిన రెండుమూడొందల త్రిశూలాలు, మూడవ దానిలో దుర్గామాత కొలువై ఉన్నారు. అగ్నికి తూర్పు భాగాన హనుమంతుని మందిరం ఉంది. ఎంతో నిర్మలంగా ఉండే ఈ ప్రదేశంలో కూర్చుంటే మనస్సు ప్రశాంతంగా ఉంటుందంటారు.

నాథ సాంప్రదాయానికి మూల పురుషుడు, గూర్ఖా తెగకు సద్గురువైన గోరఖ్‌నాథుడు. గూర్ఖాలు నేపాల్‌లో ప్రవేశించి అక్కడి తెగను జయించి ఆ ప్రాంతాన్ని ఆక్రమించారని, ఆ తరువాతి కాలంలో వారి రాజ్య విస్తరణలో భాగంగా బీహార్, ఉత్తరప్రదేశ్ వైపు తిరిగారని, అప్పటికే స్థిరపడిన బ్రిటీష్‌వారి ఎదురుదాడికి తట్టుకోలేక సగేరి వద్ద సంధి చేసుకుని, గోరఖ్‌పూర్‌ను బ్రిటిష్ వారి పరం చేశారని అంటారు. గోరఖ్ నాథులకు ఇక్కడ చాలా పెద్ద పీఠం వుంది. దానికి విలువైన మాన్యాలున్నాయి. ఈ పట్టణంలో విలాసవంతమైన గోల్‌ఘర్ బజారంతా వీరి సొంతమే.

గీతా ప్రెస్

ఇక్కడ మరో ప్రధానమైన సంస్థ ఉర్దూ బజార్ పక్కనే ఉన్న ధర్మసంస్థ గీతా ప్రెస్. హైందవ మతానికి చెందిన అన్ని గ్రంథాలను దేశీయ భాషల్లోకి అనువదించి చాలా తక్కువ రేట్లకు అమ్ముతుంటారు. ఈ భవన ప్రధాన ద్వారంపై గీతోపదేశ ఘట్టం, దేవతా విగ్రహాలు ఉన్నాయి. మేడ పైభాగమంతా రామాయణ, భాగవత గాథల ఘట్టాలు చిత్రించి వున్నాయి.

❋



పండించుకున్న జీవిత చిత్రం- నాలో నేను (జీవన కథ)

కృష్ణాజిల్లాలోని వీరులపాడు గ్రామ నివాసి పాటిబండ్ల వెంకటపతి రాయలు. ప్రస్తుతం తొంభై మూడు సంవత్సరాల వయస్సులో ఉన్న వీరు తన జీవిత చిత్రాన్ని అక్షరీకరిస్తూ 'నాలో నేను (జీవన కథ) పుస్తకాన్ని వెలువరించారు. 'నేను సామాన్య మానవుణ్ణి. నా కార్యక్రమాలు గూడా సామాన్యంగానే ఉంటాయి కాని, అసామాన్యంగా ఉండవు. చిరకాలం నా గ్రామానికి పరిమితమైయున్న నా జీవితంలో, ఆచరించిన కార్యక్రమాలు గూడ నా గ్రామానికే పరిమితమై ఉంటాయి.' అని ఈ పుస్తకానికి ముందుమాటలో వారు ప్రస్తావించారు. నిజానికి వీరులపాడు గ్రామ నిర్మాణంలో వీరి కృషిని గమనించిన వారికి ఈయన ఏమాత్రం సామాన్యుడు కాదనిపిస్తుంది. ఏదైనా ఒక గ్రామం అభివృద్ధి చెందడంలో ఆ గ్రామంలోని వ్యక్తుల పాత్ర ఎలా ఉంటుందో వీరి జీవన గాథ చదివితే అర్థమవుతుంది. ఈ పుస్తకంలో ముఖ్యంగా రెండు విషయాలు పాఠకుడి దృష్టికి వస్తాయి. మొదటిది వీరులపాడు గ్రామాన్ని తీర్చిదిద్దడంలో పాటిబండ్ల వేంకటపతి రాయలు గారి క్రియాశీలపాత్ర. రెండోది తన స్వీయకుటుంబం అభివృద్ధికి పునాదులేర్పర్చడం. గ్రామ అభివృద్ధి విషయంలో ముందుచూపు, నిజాయితీ పాఠకుణ్ణి ఆశ్చర్యపరుస్తుంది. పొలం కొనడం, ఇల్లు కట్టడం కాక చదువుకోసం డబ్బును ఖర్చుపెట్టడమే సరైనదని వీరి భావన. తన సంతానాన్ని ఉన్నత చదువులు చదివించి కుటుంబ వికాసం సాధించి దానిని ఆచరణలో రుజువు చేశారు. అత్యంత వాస్తవిక దృష్టితో రాసిన ఈ జీవన కథలో అనేక చారిత్రక విషయాలు ఉన్నాయి. అందువల్ల ఇది కేవలం పాటిబండ్ల వేంకటపతి రాయలు గారి స్వీయ జీవితమే కాదు. నాటి కాలం అంటే స్వాతంత్ర్యోద్యమ కాలానికి ముందు నుండి నేటి వరకూ జరిగిన అనేక పరిణామాలు దీనిలో ప్రస్తావించారు. వాటి ప్రభావం తనపై ఎంత ఉందో సూచనప్రాయంగా వెల్లడించారు. స్వతహాగా గాంధేయవాదిగా ఉన్న వీరు తనపై వామపక్ష రాజకీయాల ప్రభావాన్ని కూడా ప్రస్తావిస్తారు. వీరులపాడు గ్రామంలో ఈ రెండు భావాలకు చెందిన రాజకీయ వాతావరణం ఉండడం వల్ల అనివార్యంగా వీరిపై ఆ ప్రభావం ఉంది. తన జీవితంలో తనకు సాధ్యమైన మేరకు ప్రగతిశీల దృక్పథంతో జీవించడానికి వీరు చేసిన ప్రయత్నం ఈ పుస్తకంలో ప్రతిఫలిస్తుంది. వీరి విజ్ఞాన యాత్రల తీరు అభినందనీయం. వివిధ ప్రదేశాలు ముఖ్యంగా అరవిందుని ఆశ్రమం, రమణ మహర్షి ఆశ్రమం, గాంధీ ఆశ్రమం వంటి వాటిని చూడడానికి ప్రత్యేకంగా వీరు వెళ్ళడం జీవన తాత్వికత పట్ల వీరి అన్వేషణా కాంక్షను తెలియపరుస్తుంది. ఒక ప్రక్క గ్రామ, కుటుంబ అభివృద్ధిలో లీనమవుతూనే తీవ్రంగా సామాజిక చింతన చేయడం వీరిలో ఆకర్షిస్తున్న అంశం. ఆనాటి బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం, వామపక్ష ఉద్యమం, నాస్తిక ఉద్యమం ఇలాంటివన్నీ సామాన్య ప్రజలలో ఎటువంటి ప్రకంపనలు సృష్టించాయో వీరి జీవనకథలో ప్రత్యక్షంగా చూస్తాం. చరిత్ర అంటే గాఢాభిమానం ఉన్న వీరు తమ గ్రామ చరిత్రను కూడా రాశారు. అలాగే తమ వంశ చరిత్ర, తను తిరిగిన ప్రదేశాలను వివరిస్తూ ఉత్తర, దక్షిణ భారత యాత్రా విశేషాలతోనూ, ఆలయాల గురించి వీరు పుస్తకాలు రాశారు. రచయితగా కూడా వీరు ఈ విధంగా చెప్పుకోతగ్గ కృషి సల్పారు. ఈనాటి వారు ఆనాటి విషయాలను తెలుసుకోవడానికి వీరి జీవన కథను తప్పక చదవాలి. ఈ రోజున మనం చూస్తున్న పరిస్థితులకు నాటికాలంలో పరిస్థితులకు బేరీజు వేసుకోవాలంటే ఇలాంటి పుస్తకాలు చాలా ఉపయోగపడతాయి. అయితే ఈ పుస్తకం మొత్తంలో గడచిన అంశాల వివరణ బాగానే ఉన్నా, ఇంతటి అనుభవం తర్వాత నేటి సమాజం గురించి, పరిస్థితుల గురించి తన భావాలు ఏమిటో ఏ మాత్రం ప్రస్తావించకపోవడం లోటుగా ఉంది. ఒక వ్యక్తి కేంద్రంగా చారిత్రక లక్షణాలతో రాయబడిన ఈ పుస్తకం సామాజిక అవగాహనకు ఉపకరిస్తుంది. నిజాయితీ ఉండడం పట్ల వీరికి చాలా పట్టుదల. వీరి రచనలో కూడా ఎంతో నిజాయితీ కనపడుతుంది. చక్కటి శైలిలో, క్లిష్ట విషయాలను కూడా సులభంగా అర్థమయ్యేలా రాయడంలో వీరి రచనా ప్రతిభ కనపడుతుంది. అయితే వయస్సు మీదపడినా రచన మీద దృష్టిపెట్టి చక్కటి రచనలు చేస్తున్న వీరి సంకల్పబలాన్ని అభినందించాల్సిందే.

నాలో నేను
(నా జీవన కథ)
స్వీయ చరిత్ర, రచన: పాటిబండ్ల వెంకటపతిరాయలు
పేజీలు: 187, వెల: రూ.60/-
ప్రతులకు: పి.కె. రావు, 691, శ్రీనికేతకాలనీ, రోడ్డు నం. 3, బంజారాహిల్స్, హైదరాబాద్- 500 034

- వీరప్రసాద్



హితపథం

డా|| కె. శ్యాంసుందర్

వెల:30/-,
పేజీలు: 56
ప్రతులకు:
సిద్ధార్థ ఫెథాలాజికల్ డయాగ్నొస్టిక్ సెంటర్
సవరన్ స్ట్రీట్
కరీంనగర్.



వీక్షణం

బి. హనుమారెడ్డి
వెల:50/-, పేజీలు:188
ప్రతులకు:
బి. హనుమారెడ్డి
అధ్యక్షులు
ప్రకాశం జిల్లా రచయితల సంఘం,
రాజా పానగల్ రోడ్, ఒంగోల్.



మారువేషాలు

ఈ ఫొటోల్లో కనిపిస్తున్న పెద్దమనిషిని ఎక్కడో...ఎప్పుడో చూసినట్టనిపిస్తోందా. ఊహూ...బాగా పరిచయమున్న వ్యక్తిలాగా అనిపిస్తోందా? అయితే ఎవరో చెప్మా! ఆ.. పాక్ మాజీ అధ్యక్షుడు ముషరఫ్ కదూ. పాపం ఒకప్పుడు ఎంత దర్జాగా వుండేవాడు. పులిలా మెలిగాడులెండి. ప్రపంచ పోలీస్‌గా...బ్యాడ్‌బోయ్‌గా 'బిరుదు'లు పొందిన బుష్ సరసన రొమ్ము విరుచుకొని నడిచాడు. ఏదో కాలం కలిసిరాక ఇవాళ అధ్యక్షపదవికి రాజీనామా చేసి గౌరవంగా తప్పుకున్నాడు. అలాంటి ముషరఫ్‌కి ఊరూ పేరూ తెలీని ఓ నెటిజన్ ఇలా మారువేషాలు వేశాడు. ఏంటి బాగా నప్పాయంటారా! అయితే ఓకే.



మాట్లాడే చిలుక

కె. సాహిల్

శ్రీకృష్ణదేవరాయలు సభలో కొలువుదీరి వున్నాడు. మంత్రులు, అధికారులు, పుర పెద్దలు, ఆసక్తి వున్న సామాన్య ప్రజానీకం ...అంతా వున్నారు. సభా కార్యక్రమాలు ముగుస్తాయనగా...ఒక పెద్దమనిషి వచ్చాడు. అతని చేతిలో ఓ పంజరం వుంది. అందులో చిలుక ఒకటి వుంది.

ఆ వచ్చిన వ్యక్తి రాయలవైపు తిరిగి వంగి నమస్కరించి... "మహారాజా! నేను దేశదేశాలు తిరిగి వ్యాపారం చేస్తుంటాను. అక్కడ కనిపించే వింత వస్తువులను, ఆసక్తికలిగించే వాటిని కొనుక్కుంటుంటాను. ఓ దేశంలో ఇదిగో ఈ చిలుక కనిపించింది. ఇది తియ్యగా మాట్లాడుతుంది. కావాలంటే వినండి...'' అంటూ...పంజరంలో చిలుకను కదిలించాడు.

"రాజా! నమస్కారం. మహారాజుగారు వర్ధిల్లుగాక" అంది ముద్దుముద్దుగా.

దానికి రాయలు ఎంతో సంతోషించి స్వయంగా ఆసనం దిగి వచ్చి పంజరాన్ని అందుకున్నారు. ఈలోగా సామాన్య ప్రజానీకంలోని ఓ వ్యక్తి ఎంతో ఆసక్తిగా అందరినీ తోసుకుని ముందుకు రావడాన్ని గమనించిన రాయలవారు

"ఏమోయ్! నీకు ఈ చిలుక నచ్చిందా?' అనడిగాడు.

దానికతను సమాధానంగా అవునన్నట్లు తల ఊపాడు.

"అయితే నీవే ఈ చిలుక ఆలనా పాలనా చూడు. అది ఏమాత్రం నీరసించినా, దాని ఆరోగ్యం ఏ కొంచెం క్షీణించినా ...నీదే బాధ్యత... ... అది చనిపోయిందని తెలిసిందో ...నీ ప్రాణాలు తీసేస్తాను. అర్థమైందికదా..." అంటూ చిలుక పంజరాన్ని అతనికి అందించాడు.

అతను ఆనందంగా దాన్ని తీసుకొని వెళ్లిపోయాడు.

పాపం తన శక్తికొద్దీ దానికి పళ్లు, గింజలు కొనిపెట్టి బాగానే చూసుకున్నాడు. దాని ముద్దు మాటలు వింటూ తనూ సంతోషించాడు. చుట్టుపక్కలవారు కూడా వచ్చి దాని మాటలు విని ఎంతో సంతోషంగా వెళ్లేవారు. అలాంటిది ఓరోజు పాపం చిలుక చనిపోయింది. దాన్ని నిర్జీవంగా చూసి అతను ఎంతగానో బాధపడ్డాడు. కుటుంబ సభ్యులెవరో చనిపోయినట్టు విలపించాడు. ఇంతలో రాయలవారు తనకు చిలుకను ఇస్తూ చెప్పిన విషయాలు గుర్తొచ్చాయి.

"అమ్మో! ఇప్పుడు నన్ను కూడా ఉరి తీసేస్తారు కాబోలు. నా ప్రాణం కన్నా ఎక్కువగా చూసుకున్నా, కానీ ఏం లాభం. అదెందుకు చచ్చిందో తెలీదు. ఇప్పుడు రాయలవారికి ఈ విషయం ఎలా చెప్పాలి? చెప్తే నా ప్రాణం పోతుంది కదా" అనుకుంటుండగా తెనాలి రామకృష్ణుడు గుర్తొచ్చాడు.

వెంటనే ఆయన ఇంటికెళ్లి కాళ్లమీద పడి అసలు విషయం చెప్పి బాధపడ్డాడు. కన్నీరు కార్చాడు. పరిష్కారం ఏదైనా సూచించమని కోరాడు. దానికాయన నవ్వి చెవిలో రహస్యంగా ఓ విషయం చెప్పాడు. కళ్ల నీళ్లు తుడుచుకుంటూ వెళ్లిపోయాడా వ్యక్తి.

తర్వాత రాజప్రాసాదానికి వెళ్లాడా వ్యక్తి. సభ ముగిసిన తర్వాత రాజు గారిని కలిసి

"రాజా! చిలుక ఎందుకో మాట్లాడడం లేదు. కళ్లు కూడా తెరవడం లేదు. తల కూడా కదల్చడం లేదు. రెక్కలు కూడా ఆడించడం లేదు. అసలు కదలకుండా అలా వుండిపోయింది. ఏం చేయాలో తెలీలేదండీ...మీరే ఏదైనా సలహా ఇవ్వండి" అంటూ చేతులు జోడించాడు.

రాయలవారికి ఏం జరిగిందో అర్థంకాక "సరే పద. చిలుకను చూద్దాం" అంటూ హడావిడిగా బయలుదేరి వెళ్లాడు.

తీరా వెళ్లి చూస్తే అక్కడ పంజరంలో నిర్జీవంగా పడి వున్న చిలుక కనిపించింది. వెంటనే పట్టరాని కోపం వచ్చింది. ఆగ్రహంతో ఊగిపోతూ... ''చిలుక చనిపోయిందని చెప్పకుండా కాళ్లు కదిలించడంలేదు. రెక్కలాడించడంలేదు. మాట్లాడడంలేదు..అని నంగి నంగి కబుర్లు చెప్తావా? బంగారంలాంటి చిలుకను చంపేశావుకదా. నీ ప్రాణాల మీద ఆశ వుండే ఇలా చేశావా! నీకు చిలుకను అప్పగించేటప్పుడే జాగ్రత్తలు చెప్పానుకదా..." అంటూ కేకలేశాడు.

దాంతో భయపడిపోయిన అతను రాయలవారి కాళ్లమీద పడి "రాజా! ఇందులో నా తప్పేం లేదండీ. మీతో ఇలా చెప్పమంది తెనాలి రామకృష్ణులవారే. నా తప్పేం లేదండీ" అంటూ కళ్లెంట నీళ్లు పెట్టుకున్నాడు. రామకృష్ణుడు నవ్వుతూ కనిపించాడు. అప్పుడు అర్థమైంది రాయలవారికి. చిలుక చనిపోవడంలో ఆ వ్యక్తి తప్పేంలేదని. కోపంలో ఆలోచన లేకుండా మాట్లాడినందుకు సిగ్గుపడుతూ ..ఆ వ్యక్తికి క్షమాపణలు చెప్పి పంపేశాడు.

రామకృష్ణుడే లేకపోతే ఆ వ్యక్తికి తను శిక్ష వేసేవాడు. అమాయకుడు శిక్ష అనుభవించాల్సి వచ్చేది. అదంతా తప్పినందుకు రాయలు ఎంతగానో సంతోషించాడు.